
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 15 మార్చి 2024 | 5





అల పిఠాపురాన..

నా గురువు జన్మస్థలం.. పిఠాపురం

2014లో జనసేన తరపున పిఠాపురం నుంచి పోటీ చేయమని చాలామంది అడిగారు. కానీ అప్పుడు కుదర్లేదు. అయితే ఇప్పుడు పిఠాపురం నుంచి పోటీచేయాలని నిర్ణయించుకున్నా. నా గురువైన దత్తాత్రేయుల అవతారమైన శ్రీపాద శ్రీవల్లభుడు జన్మస్థలమది. అది.. శక్తి పీఠం కూడా.. అక్కడి నుంచే పోటీ చేస్తా. ఎంపీగా పోటీ చేయాలా లేదా అనేది ఇంకా నిర్ణయించుకోలేదు.

- కొణిదెల పవన్‌కల్యాణ్, జనసేన అధినేత

రాజమండ్రి రూరల్

వైసీపీని ఓడించండి..



ప్రజలందరూ తాయిలాలు తీసుకోండి.. కానీ మన భవిష్యత్తు కోసం ఈ దుర్మార్గ ప్రభుత్వాన్ని ఓడించండి. మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సారధ్యంలో ముందుకుసాగుదాం. చదువుకున్న మేధావులంతా తప్పనిసరిగా ఓటు వేయాలి. ఓటు కొనేవారికి విలువ తెలపాలి.

- బుచ్చయ్యచౌదరి, టీడీపీ

రాజోలు

అభివృద్ధికి పాటుపడతా..



సీనియర్ ఐఏఎస్ అధికారిగా పనిచేసిన అనుభవంతో రాజోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ ప్రగతి పథంలో నడిపించడానికి కృషి చేస్తా. నియోజకవర్గ ప్రజల సహకారంతో జనసేన అభ్యర్థిగా ఘన విజయం సాధిస్తా. కూటమి ప్రభంజనం సృష్టిస్తుంది.

- దేవ వరప్రసాద్, జనసేన

ప్రత్తిపాడు

ప్రజా సంక్షేమానికి కృషి



నా భర్త రాజా ఆశయ సాధనకు, నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తా. నాకు టీడీపీ తరపున టిక్కెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

- వరుపుల సత్యప్రభ, టీడీపీ

కొవ్వూరు

గెలిచి బాబుకు గిఫ్ట్ ఇస్తా..



పాలకుడిగా కాదు.. సేవకుడిగా కొవ్వూరు నియోజకవర్గ ప్రజలకు సేవచేస్తా. టీడీపీ అధినేత చంద్రబాబు నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నియోజకవర్గ నాయకులందరినీ కలుపుకుని మంచి మెజార్టీతో గెలిచి కొవ్వూరును చంద్రబాబుకు గిఫ్టుగా ఇస్తా.

- ఎం.వెంకటేశ్వరరావు, టీడీపీ

గోపాలపురం

క్రమశిక్షణకు గుర్తింపు



టీడీపీలో క్రమశిక్షణతో పనిచేసే ప్రతి ఒక్కరి నిబద్ధతకు పట్టం కడతారు. కష్టకాలంలో పార్టీ కోసం కష్టించి పనిచేసే యువతను అధినేత చంద్రబాబు గుర్తిస్తారు. టిక్కెట్టు కేటాయించడం పట్ల అధినేత చంద్రబాబు, లోకేశ్‌లకు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు.

- ఎం. వెంకట్రాజు, టీడీపీ

రామచంద్రపురం

మంచి మెజార్టీతో గెలుస్తా



టీడీపీ జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఘన విజయం సాధిస్తాను. అన్ని వర్గాల ప్రజలను సంఘటితం చేసుకుని ఎన్నికల్లో వ్యూహాత్మకంగా పనిచేసి మంచి మెజార్టీతో గెలుస్తాను. వైసీపీపై ఉన్న వ్యతిరేకతను ఓటర్లలోకి తీసుకువెళ్లి వారి సహకారంతో గెలవడం తథ్యం.

- వాసంశెట్టి సుభాష్, టీడీపీ

రంపచోడవరం

దరఖాస్తు పెట్టుకున్నా..



రంపచోడవరం తెలుగుదేశం అభ్యర్థిగా ఎంపికవడం ఊహించని పెద్ద బాధ్యతగా భావిస్తున్నా. టీడీపీ తరపున అవకాశం ఇవ్వాలని దరఖాస్తు పెట్టుకున్నా. టీడీపీ అధినేత చంద్రబాబు యువతకు అవకాశం ఇవ్వాలన్న లక్ష్యం మేరకే సీటు ఇచ్చారు.

- శిరీషాదేవి, టీడీపీ

ఉమ్మడి తూర్పున స్థానాలు (పశ్చిమ స్థానాలతో సహా..)	22
ఇప్పటివరకూ ప్రకటన	20
టీడీపీ	15
జనసేన	5
మిగిలినవి	2

జిల్లాల విభజనలో భాగంగా పశ్చిమ నుంచి మూడు నియోజకవర్గాలు ఉమ్మడి తూర్పులో కలిశాయి.. రెండు టీడీపీ.. ఒక స్థానంలో జనసేన పోటీ చేస్తున్నాయి.



సమరమే..

- ఉమ్మడి జిల్లాలో మరో నాలుగు స్థానాలు ప్రకటన
- రాజమహేంద్రవరం రూరల్ సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్లకే
- పిఠాపురం నుంచి బరిలోకి పవన్.. వీడిన సస్పెన్స్
- రిటైర్డ్ ఐఏఎస్ వరప్రసాద్‌కు రాజోలు సీటు
- ఇప్పటి వరకు 20 స్థానాల్లో అభ్యర్థుల వెల్లడి
- టీడీపీ నుంచి 15 మంది, జనసేన నుంచి ఐదుగురు
- కాకినాడ సిటీ, అమలాపురం అభ్యర్థులపై ఉత్కంఠ
- పిఠాపురం, కొవ్వూరు సీట్లపై భగ్గుమన్న తమ్ముళ్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డంతో టీడీపీ, జనసేన పార్టీలు అభ్యర్థుల లెక్కలు తేల్చేశాయి. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న స్థానాల గుట్టు విప్పేశాయి. తొలివిడత జాబితాలో పెద్దగా తలనొప్పులు లేని సీట్లను ప్రకటించిన ఇరుపార్టీలు మలివిడత ప్రకటించాల్సిన జాబితాపై భారీ కసరత్తు జరిపాయి. సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల సామర్థ్యాలు, ప్రత్యర్థి పార్టీ బలాబలాలపై కొన్నిరోజులుగా విస్తృత కసరత్తు జరిపి ఎట్టకేలకు గురువారం గెలుపు గుర్రాలను ప్రకటించాయి. మొత్తం ఆరు స్థానాల్లో అభ్యర్థులపై స్పష్టత రాగా, ఇందులో టీడీపీ నాలుగు, జనసేన ఇద్దరు అభ్యర్థుల పేర్లను ప్రకటించాయి. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ స్థానాలకు రెండో జాబితాతో కలిపి మొత్తం 17 స్థానాల్లో అభ్యర్థుల పేర్లను రెండు పార్టీలు వెల్లడించాయి. ఇంకా కాకినాడ సిటీ, అమలాపురం సీట్లకు సంబంధించి బరిలో నిలబడేదెవరనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. కాగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేసే స్థానంపై ఇంతకాలం కొనసాగిన గందరగోళానికి తెరపడింది. దీనికి స్వయంగా పవన్ ఫుల్‌స్టాప్ పెట్టారు. పిఠాపురం నుంచి బరిలోకి దిగుతున్నట్టు ఆయనే వెల్లడించారు. అటు రాజమహేంద్రవరం రూరల్ సీటుపైనా స్పష్టత వచ్చేసింది. ప్రత్యామ్నాయంగా జనసేనకు నిడదవోలు స్థానం కేటాయించి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్లకే టీడీపీ సీటు ఖాయం చేసింది. కాగా గురువారం ప్రకటించిన ఆరు స్థానాల్లో నాలుగు స్థానాల్లో అభ్యర్థులు ఏకంగా తొలిసారి పోటీ చేస్తున్నవారే కావడం విశేషం. ఈ ఎంపికలోను ఇరుపార్టీలు సామాజిక సమతూకం పాటించాయి. కాగా పవన్ పిఠాపురం నుంచి బరిలోకి దిగుతుండడంతో టీడీపీ ఇన్‌చార్జి వర్మకు అన్యాయం జరిగిందంటూ తెలుగుదేశం శ్రేణులు ఆందోళనకు దిగాయి.

అన్నీ బేరీజు వేసి... ధీటైన ఎంపిక చేసి..



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మెజార్టీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన పావులు కదుపుతున్నాయి. అందులో భాగంగా అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘ కసరత్తు జరిపిన తర్వాతే గెలుపు గుర్రాలను ఖాయం చేస్తున్నాయి. తాజాగా గురువారం టీడీపీ రెండో జాబితా విడుదల చేసింది. ఇందులో నాలుగు స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. రాజమహేంద్రవరం రూరల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేరును ఖాయం చేసింది. ప్రత్తిపాడు నుంచి వరుపుల సత్యప్రభ, రామచంద్రపురం నుంచి వాసంశెట్టి సుభాష్, రంపచోడవరం నుంచి మిరియాల శిరీష పేర్లు ఖరారయ్యాయి. వాస్తవానికి గత నెల 24న టీడీపీ అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన సమయంలో ఈ నాలుగు సీట్లను పెండింగ్‌లో ఉంచింది. వీటిలో కొన్ని సీట్లను జనసేన కోరుతుండడం, మరికొన్నిచోట్ల అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా ఉండడంతో పార్టీ అధిష్ఠానం విస్తృత కసరత్తు జరిపింది. రాజమహేంద్రవరం రూరల్ సీటు విషయమై ఇరుపార్టీల మధ్య పీటముడి కొనసాగడంతో తొలి విడత జాబితాలో అభ్యర్థి ప్రకటన వాయిదాపడింది.ఎట్టకేలకు ఈ సీటుపై ఇరుపార్టీలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. రాజమహేంద్రవరం రూరల్ సీటుకు బదులు దుర్గేష్‌కు నిడదవోలు ఇవ్వడానికి టీడీపీ ముందుకు రావడంతో బుచ్చయ్యకు లైన్‌క్లియర్ అయింది. ఈ నేపథ్యంలో గురువారం నాటి జాబితాలో గోరంట్ల పేరు ప్రకటించారు. అటు రామచంద్రపురం సీటు కోసం శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన వాసంశెట్టి సుభాష్, కాదా వెంకటరమణ పోటీపడ్డారు. వైసీపీ నుంచి ఎంపీ బోస్ తనయుడు బరిలో ఉన్న నేపథ్యంలో ఆయన్ను సమర్థవంతంగా ఢీకొట్టే యువకుడిగా సుభాష్‌ను గుర్తించి ఆయనకు సీటు ఖాయం చేశారు. పైగా ఇక్కడ అభ్యర్థిని ప్రకటించడానికి ముందురోజు కూడా టీడీపీ ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. ఇందులో సుభాష్ వైపు మొగ్గు రావడంతో పేరు ఖాయం చేసింది. ప్రత్తిపాడు సీటు వరుపుల సత్యప్రభకు ఖాయమైంది. తొలివిడత జాబితాలో ఈమె పేరు ఉంటుందని భావించినా పార్టీలో అంతర్గత సమస్యలను చక్కదిద్దాల్సి రావడంతో ప్రకటన వాయిదా వేశారు. అటు జనసేన కూడా ఈ సీటు కోరడంతో ప్రకటించలేదు. అయితే పిఠాపురం సీటు నుంచి పవన్ పోటీ ఖాయం అవడంతో, ప్రత్తిపాడు నుంచి కాపు సామాజికవర్గానికి చెందిన సత్యప్రభకు లైన్‌క్లియర్ అయింది. అటు రంపచోడవరం సీటు అనూహ్యంగా మిర్యాల శిరీషను వరించింది. రాజవొమ్మంగి మండలం గింజర్తికి చెందిన ఈమె గిరిజనతెగలో కోయ సామాజికవర్గానికి చెందినవారు. గతంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి సీటు ఆశించినా వైసీపీకి ధీటైన అభ్యర్థిగా శిరీష అని తేలడంతో సీటు ఈమెకే ఖరారైంది. తాజాగా టీడీపీ ప్రకటించిన నాలుగు సీట్లలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి మినహా మిగిలిన ముగ్గురు అభ్యర్థులు తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న నేతలే. ఇదిలా ఉంటే తాజా రెండో జాబితాతో కలిపి ఇప్పటివరకు మొత్తం 13 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను బరిలోకి దించినట్టయింది. ఇందులో ఎక్కడికక్కడ సామాజిక సమతూకం పాటించి అన్నివర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా జాగ్రత్తలు తీసుకుని గెలుపుగుర్రాలను ఎంపిక చేసిందనే అభిప్రాయం వినిపిస్తోంది.

సస్పెన్స్‌కు తెర.. పవన్ రెడీ!

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీచేసే స్థానంపై కొంతకాలంగా నెలకొన్న సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. పిఠాపురం సీటు నుంచి తాను పోటీ చేస్తున్నట్టు స్వయంగా పవన్ ప్రకటించడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు అందరి దృష్టి ఈ నియోజకవర్గంపై పడింది. వాస్తవానికి ఈసారి పవన్ పిఠాపురం నుంచే బరిలోకి దిగుతారని బలంగా ప్రచారం జరిగింది. అదే సమయంలో గతంలో పోటీచేసిన గాజువాక, భీమవరం నుంచి కూడా పోటీ చేయవచ్చనే చర్చ జరిగింది. కానీ బుధవారం ఈ రెండు స్థానాల్లో అభ్యర్థులను వెల్లడించడంతో పవన్ పిఠాపురం నుంచి పోటీచేయడం ఖాయమని తేలిపోయింది. పవన్ కూడా గురువారం ఇదే విషయాన్ని ప్రకటించారు. దీంతో పవన్ పోటీ చేసే స్థానంపై సస్పెన్స్‌కు ముగింపు లభించింది. అటు పిఠాపురం నుంచే పవన్ బరిలోకి దిగుతారని ఆంధ్రజ్యోతి ముందే వెల్లడించింది. పవన్ ప్రకటన నేపథ్యంలో పిఠాపురం టీడీపీలో ముసలం రాజుకుంది. ప్రస్తుత ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వర్మకు అన్యాయం జరిగిందంటూ టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. టీడీపీ గెలిచే స్థానం అయినప్పటికీ అధిష్ఠానం ఈ సీటును జనసేనకు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. వర్మకు టిక్కెట్టు లేకపోవడంతో పిఠాపురం టీడీపీ కార్యాలయం ఎదుట పార్టీ జెండాలను కార్యకర్తలు తగులబెట్టారు. అటు వర్మ కూడా మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం టీడీపీ కార్యకర్తలు నిర్వహిస్తున్న సమావేశానికి హాజరై పార్టీ కేడర్ అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు. ఈనేపథ్యంలో వర్మ ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతారనే చర్చ జరుగుతోంది. మరోపక్క పవన్ పిఠాపురం నుంచి పోటీ ఖాయమైన నేపథ్యంలో సినీ డైరెక్టర్ రాంగోపాల్‌వర్మ తాను కూడా పిఠాపురం నుంచి పోటీ చేస్తానని సోషల్ మీడియాలో ప్రకటించడం విశేషం. ఇదిలా ఉంటే రిజర్వుడు నియోజకవర్గమైన రాజోలు సీటు మాజీ ఐఏఎస్ అధికారి వరప్రసాద్‌కు ఖరారైంది. జనసేనలో కీలకమైన జనవాణి కార్యక్రమాన్ని వరప్రసాద్ కొన్నేళ్లుగా పర్యవేక్షిస్తున్నారు. మలికిపురం మండలం దిండికి చెందిన ఈయన స్థానికుడు కూడా కావడంతో టిక్కెట్టు ఇవ్వడానికి జనసేన మొగ్గు చూపింది. అయితే ఈయనకు సీటు కేటాయింపుపై అధికారిక ప్రకటన రావలసి ఉంది.

ఆ రెండూ ఎప్పుడో...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ స్థానాలకు ఇప్పటి వరకు రెండు జాబితాల్లో కలిపి టీడీపీ, జనసేన 17 సీట్లలో అభ్యర్థులను ప్రకటించినట్టయింది. ఇంకా కాకినాడ సిటీ, అమలాపురం నియోజకవర్గాల్లో బరిలో ఎవరు ఉంటారనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. కాకినాడ సిటీలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడిని ఢీకొట్టే సమర్థ నేతను ఎంపిక చేయడం కోసం కొన్నిరోజులుగా టీడీపీ అధిష్ఠానం ఎడతెగని కసరత్తు చేస్తోంది. పైగా ద్వారంపూడిని ఎలాగైనా ఓడించాలని టీడీపీ, జనసేన పార్టీలు పట్టుదలగా ఉన్నాయి. ఈయన ఎలా గెలుస్తాడో చూస్తానంటూ పవన్ సైతం ఇప్పటికే శపథం పట్టారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కొండబాబు టిక్కెట్టు రేసులో ఉన్నా మరింత మెరుగైన అభ్యర్థి కోసం వడపోత పోస్తున్నట్టు సమాచారం. అమలాపురం సీటుపైనా ఉత్కంఠ నెలకొంది. ఈ సీటు జనసేన కోరుతోంది. టీడీపీ నుంచి కూడా పోటీ ఉంది. అయితే రామచంద్రపురం సీటులో తాజాగా టీడీపీ తన అభ్యర్థిని నిలబెట్టడంతో జనసేనకు అమలాపురం సీటు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. త్వరలో ఈ రెండు స్థానాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా ఇప్పటి వరకు ఇరు పార్టీలు ప్రకటించిన మొత్తం 17 అసెంబ్లీ సీట్లలో ఎనిమిది మంది పూర్తిగా మొదటిసారి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేస్తున్న వారే కావడం విశేషం. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో మూడు ఎంపీ స్థానాలపైనా త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

తూర్పున మరో రెండు..

గోపాలపురం నుంచి మద్దిపాటి.. కొవ్వూరు ముప్పిడి..

రాజమహేంద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలోకి పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా నుంచి కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాలు కలిసిన విషయం తెలిసిందే. ఈ మూడు నియోజకవర్గాలకు సంబంధించి తెలుగుదేశం, జనసేన ఉమ్మడి పొత్తులో భాగంగా ఇప్పటికే నిడదవోలు అసెంబ్లీ నుంచి జనసేన అభ్యర్థిగా కందుల దుర్గేష్‌ను ప్రకటించారు. గురువారం ప్రకటించిన టీడీపీ జాబితాలో కొవ్వూరు నుంచి ముప్పిడి వెంకటేశ్వరరావును అభ్యర్థిగా ఎంపిక చేశారు. ముప్పిడి 2014లో గోపాలపురం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికకాగా, 2019లో ఓటమి పాలయ్యారు. గోపాలపురం వైసీపీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న తలారి వెంకట్రావును ఇటీవల ఆ పార్టీ అధిష్ఠానం కొవ్వూరు నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో గతేడాది ఎన్నికల్లో తలపడిన ముప్పిడి, వెంకట్రావులు ఈసారి మళ్లీ కొవ్వూరు నుంచి తలపడుతున్నట్టు అయింది.ఇక తాజాగా టీడీపీ ప్రకటించిన జాబితాలో గోపాలపురం అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజును ప్రకటిస్తూ టీడీపీ అధిష్ఠానం క్లియరెన్స్ ఇచ్చింది. ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థినిగా హోం మంత్రి తానేటి వనిత పోటీ చేస్తున్నారు. తొలి జాబితాలోనే గోపాలపురం సీటు ప్రకటించాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల రీత్యా నిలుపుదల చేశారు. నియోజకవర్గంలో అంతా సర్దుబాటు చేసి ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న మద్దిపాటి వెంకట్రాజునే అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో విభజిత తూర్పు యుద్ధానికి సిద్ధమైంది.

తూర్పు.. కూర్పు

- జిల్లాలో కూటమి అభ్యర్థుల ఖరారు
- ఇక లోక్‌సభ సీటు బీజేపీకే..
- అధికారిక ప్రకటనే తరువాయి
- వెనుకబడిన వైసీపీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో టీడీపీ అభ్యర్థులను మొత్తం ఖరారు చేసింది. టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థుల ఖరారు పూర్తయింది. ఇక రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ పోటీ చేయనుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేస్తారని చెబుతున్నారు. కానీ అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.ఈ ప్రకటన జారీ అయితే జిల్లాలో టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి ముందుగానే అభ్యర్థులను ఖరారు చేసినట్టు అవుతుంది.దీంతో ఎన్నికల బరికి కూటమి సిద్ధమైంది. వైసీపీ ఇంకా ముగ్గురు అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అభ్యర్థులను ఖరారు చేయడంలో వెనుకబడిపోయింది. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానం ఉన్న సంగతి తెలిసిందే. గురువారం రాజమహేంద్రవరం రూరల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు, కొవ్వూరు నుంచి మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేరును ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో జిల్లాలో మొత్తం అసెంబ్లీ అభ్యర్థులను ఖరారు చేసి బరిలో కూటమి బలంగా నిలబడింది. తెలుగుదేశం- జనసేన ఉమ్మడిగా ప్రకటించిన తొలిజాబితాలో రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డి వాసు, అనపర్తి నుంచి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం నుంచి జనసేన నేత బత్తుల బలరామకృష్ణ పేరు ప్రకటించిన విషయం తెలిసిందే. తర్వాత నిడదవోలు నుంచి జనసేన నేత కందుల దుర్గేష్ పేరును ప్రత్యేకంగా పవన్ కల్యాణ్ ప్రకటించారు. జిల్లాలో టీడీపీ ఐదు స్థానాల నుంచి జనసేన రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నాయి. లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించిన సంగతి తెలిసిందే. ఇక టీడీపీ సీనియర్‌నేత, పొలిట్ బ్యూరో సభ్యుడు, రూరల్ సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి 10వ సారి ఎన్నికల బరిలో దిగనున్నారు. ఎన్టీఆర్ పిలుపుతో టీడీపీలో చేరిన బుచ్చయ్యచౌదరి ఇప్పటి వరకూ 9 సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఆరుసార్లు విజయం సాధించారు. కొవ్వూరు నుంచి గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బరిలోకి దిగారు. ఇక్కడ ఒక విశేషం ఉంది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరావు, కొవ్వూరులో వైసీపీ అభ్యర్థిగా ఉన్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఇప్పటికే రెండు సార్లు పోటీపడ్డారు. ఇది మూడో సారి. 2014,2019 ఎన్నికల్లో ఒకరి చేతిలో మరొకరు ఓడిపోయారు. ఇవాళ ఈ ఇద్దరినీ తెలుగుదేశం, వైసీపీ పార్టీలు కొవ్వూరు నుంచి పోటీ చేయిస్తున్న సంగతి తెలిసిందే. ఇలా మూడోసారి పోటీపడుతున్నారు. కొవ్వూరులో మాజీ మంత్రి,జిల్లా టీడీపీ అధ్యక్షుడు కెఎస్ జవహర్‌కు టికెట్ రాకపోవడంతో ఆయన వర్గం అసంతృప్తిగా ఉంది. జవహర్ మాట్లాడుతూ తాను ఇక్కడ నుంచే పోటీ చేస్తానని ప్రకటించడం గమనార్హం.గోపాలపురం నుంచి తొలిసారి టీడీపీ అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజు పోటీ చేస్తున్నారు. జిల్లాలో మొదటగా మద్దిపాటి వెంకట్రాజు పేరునే చంద్రబాబు సుమారు రెండేళ్ల క్రితమే ప్రకటించినట్టు అయింది.ఇవాళ చంద్రబాబు అధికారికంగా వెంకట్రాజు పేరును ప్రకటించారు. బీజేపీ నేతలు కొంతమంది అనపర్తి అసెంబ్లీ స్థానం కోసం పట్టుపడుతున్నట్టు సమాచారం. కానీ టీడీపీ ఇప్పటికే అక్కడి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీజేపీ అభ్యర్థనను టీడీపీ ససేమిరా అంటున్నట్టు సమాచారం.దీంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎన్నికలకు సిద్ధమైంది. ఇకషెడ్యూల్ రావడమే తరువాయి. అభ్యర్థులను పూర్తిగా ఖరారు చేయడంలో అధికార వైసీపీ వెనుకబడింది. ముందుగా హడావిడి చేసి నాలుగు స్థానాల్లో మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీని సమన్వయకర్తల పేరుతో అసెంబ్లీ స్థానాలకు బదిలీచేసింది. ఎంపీ స్థానంలో సమన్వయకర్తగా డా.గూడూరి శ్రీనివాసరావును ప్రకటించింది. సమన్వయకర్తలంతా అభ్యర్థులు కాదని ఆ పార్టీ నేతలే ప్రకటించడంతో ఎవరు అభ్యర్థులో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. అంతేకాక అనపర్తి,రాజానగరం, నిడదవోలు వైసీపీకి సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. కానీ వారిని కూడా ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

వైనాట్ 0కి సీఎం జగన్ వెళ్లిపోయాడు

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 14 : ఈ వైసీపీ నాయకులంతా ఐదేళ్లపాటు గాడిదలు కాశారా.. ఎన్నికల ముందు శంకుస్థాపనలు చేస్తారా అని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రశ్నించారు. రాజమహేంద్రవరంలో తన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌కే సిగ్గు ఎగ్గు లేకుండా పూర్తి కాని భవనాలను ప్రారంభించారు. మంత్రులు ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యంగా చేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం రూరల్ సిటీలలో 56 వేల మంది లబ్ధిదారులను నిర్ణయించి ఎంత మందికి పట్టాలు ఇచ్చారన్నారు. గతంలో ఇచ్చిన పట్టాలు నాలుక గీసుకోవడానికి పనికిరాకుండా పోయాయన్నారు. ఇళ్ళకోసం సేకరించిన భూముల్లో భారీ ఎత్తున అవినీతి జరిగింది, ఎంపీలు ,ఎమ్మెల్యేలు కలిసి దోపిడీ చేశారన్నారు . దానిలో జగన్‌కు వాటాలు వెళ్లాయని ఆరోపించారు. రూరల్ ఆయన పాత్రలు పంచిపెట్టాడు, ఇప్పుడు చీరలు పంచడానికి సిద్ధంగా ఉన్నాడన్నారు. వైనాట్ 0కి జగన్ వెళ్లిపోయాడన్నారు. అన్నివర్గాల ప్రజలు జగన్‌ను ఛీకొడుతున్నారని ఇటువంటి తరుణంలో జగన్ ఎన్నికలకు కూడా వెళ్లకుండా దిగిపోవాలన్నారు. జగనన్న కాలనీ పేరుతో లక్షలాది మందిని మోసం చేసిన జగన్ కు గుణపాఠం చెబుతామన్నారు. పోస్టల్ బ్యాలెట్ దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్నారు. 85 ఏళ్ళ వయస్సుగల వారు ఇంటి వద్దే ఓటు వేస్తారు అందువల్ల ప్రలోభపెట్టే అవకాశం ఉందన్నారు. చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. సిద్ధం అన్నది దీనికా గిన్నెలు, చీరలు ,మద్యం పంచడానికా జగన్ అని ప్రశ్నించారు. ఇప్పటికే కర్నాటక మద్యం రాష్ట్రంలోకి తెచ్చేశాడన్నారు. తెలుగు జాతిని సిగ్గుపరుస్తున్న జగన్‌ను ఓడించాలన్నారు. జిల్లా కలెక్టరేట్ అవినీతికి అడ్డాగా మారిపోయిందన్నారు.

మీ చీరలు మాకొద్దు.. మంచినీళ్లివ్వండి!

రాజమహేంద్రవరం బెస్తా వీధిలో మహిళల ఆందోళన - భరత్‌రామ్ పంపిణీ చేసిన చీరలు దహనం చేసి నిరసన



బెస్తావీధిలో చీరలు దహనం చేసి ఆందోళన చేస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 14: చీరలు.. సారెలు పంచి ఇదే అభివృద్ధి అనుకోండి అంటే ఓట్లు రావని రాజమహేంద్రవరం ప్రజలకు అన్ని తెలుసునని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరం బెస్తావీధిలో స్థానిక మహిళలు ఎంపీ భరత్ రామ్ తీరును నిరసిస్తూ ఎంపీ పంచిన చీరలు దగ్ధం చేశారు. సురక్షిత తాగునీరు కావాలంటూ ఖాళీ బిందెలతో ప్రదర్శన చేశారు. గురువారం టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు ఆధ్వర్యంలో ఖాళీ బిందెలు, డ్రైనేజీ వాటర్‌తో తాగునీరు కలిసిన నీరు పోసిన బాటిల్స్, ఎంపీ ఇచ్చిన చీరలతో నిరసన ప్రదర్శన చేశారు. ఆందోళనకారులకు ఆయన మద్దతుగా నిలిచి మాట్లాడారు. తమ హయాంలో మంచినీటి విషయంలో ఏనాడు ఇబ్బంది పడలేదన్నారు. ప్రజల అవసరాలు తీర్చేవాడే ప్రజాప్రతినిధి అన్నారు. పదిరోజుల కిందట ఒకరిని పరామర్శించడానికి వచ్చాను.. అప్పటికే రోడ్లు తవ్వేసివదలేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం పైప్‌లైన్ వేయాలని గోతులు తవ్వేశారు. కానీ లైన్ వేయలేదన్నారు. ఇదే విషయాన్ని అధికారులకు చెప్పానన్నారు. రాజమహేంద్రవరం అభివృద్ధిలో భరత్ రామ్ చేసిన తప్పులు కప్పిపుచ్చడానికి చీరసారె ఇస్తున్నాడన్నారు. ఎంపీ భరత్ రామ్ నగరంలో రాళ్ళు రప్పలు అంటించాడు తప్ప చేసిందేమీలేదన్నారు. స్థానిక మహిళ రొక్కం వరలక్ష్మి మాట్లాడుతూ తమకు చీరలు అనవసరంలేదు తమ ప్రాణాలు కాపాడేందుకు సురక్షితమైన తాగునీరందించాలన్నారు. ఇటీవల ఎంపి భరత్ రామ్ వస్తే మంచినీటి కుళాయిలో ధార సక్రమంగా రావడంలేదంటే ఎంత లావు ధార కావాలమ్మా అంటూ వెటకారంగా మాట్లాడారన్నారు. తాగునీరు అందించలేక పోయారు గాని చీరలు పంచుతున్నాడన్నారు.నగర అధ్యక్షుడు రెడ్డి మణి మాట్లాడుతూ గత రెండు నెలలుగా ఈ ప్రాంతంలో గోతులు తవ్వేశారని డ్రైనేజీ వాటర్ కలిసి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎకరా కొండ, పిల్లి నాగలక్ష్మి, సానబోయిన పరమేశ్వరి, మహాలక్ష్మి, నాయకులు దొండపాటి కృష్ణాపర్ వీర్రాజు, పసలపూడి ఎలిషా, కోటేశ్వరరావు, యడ్ల గండియ్య, రామకృష్ణ, కుడుపూడి నాగు, సప్పావెంకటరమణ, కర్రి సూర్యనాయుడు, లోకేష్, చాపల చిన్నరాజు, కర్రి కాశి, గాయత్రి, మేరీ, కృష్ణపర్ ,యడ్ల గండిపోసియ్య, బోయి బాబి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేడా శ్రీనివాస్

రాష్ట్రంలో అవినీతి పాలన : మేడా

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 14: రాష్ట్రంలో అవినీతి పరిపాలనను ప్రజలు తమ ఓట్లతో అంతమొందించాలని రాష్ట్రీయప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపకుడు మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు రాష్ట్రాన్ని అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయని పాలకులు మాత్రం ప్రజా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ అవినీతి మయంగా మారాయన్నారు. బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లను పెంచిపోషిస్తున్నారని ఆరోపించారు. ఉపాధి గాలికొదిలేశారని.. రాజమహేంద్రవరం మురికి కూపంగా మార్చేశారని మండిపడ్డారు. కేజీ బేసిన్‌లో 70 లక్షల కోట్లు చమురునిక్షేపాలను కార్పొరేట్ సంస్థలు కొల్లగొట్టుకుపోతుంటే ఈ ప్రాంత అభివృద్ధికి మనవాటా మనకు అడితే ఎంపీలే లేకుండా పోయారన్నారు. అందుకే రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నుంచి పోరాడే వారిని ఎన్నికల బరిలోకి దింపుతున్నామన్నారు. ఇప్పటికే బాపట్ల, హిందూపురం, అమలాపురం, అనకాపల్లి, విశాఖపట్నం లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించామని చెప్పారు. త్వరలో రాజమండ్రితో పాటు మరొక ఎంపీ స్థానాన్ని ప్రకటిస్తామన్నారు. సమావేశంలో పెండ్యాల కామరాజు, డివి రమణమూర్తి, సత్తి వెంకటరెడ్డి, వర్ధనపు శరత్ కుమార్, ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ పోటీపై భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు



జెండాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు దహనం చేస్తున్న కార్యకర్తలు

- టీడీపీ ఫ్లెక్సీలు, జెండాలు దహనం
- వర్మకు పార్టీ అన్యాయం చేసిందంటూ మండిపాటు
- ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని డిమాండ్
- పవన్‌ను ఓడిస్తామంటూ ఆగ్రహావేశాలు

పిఠాపురం, మార్చి 14: పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్టు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన ప్రకటన పిఠాపురంలో ప్రకంపనలు సృష్టించింది. పవన్ ప్రకటనపై తెలుగు తమ్ముళ్లు భగ్గుమన్నారు. టీడీపీ ఫ్లెక్సీలు, జెండాలను దహనం చేశారు. రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం అహర్నిశలు కష్టించి పనిచేసిన మాజీ ఎమ్మెల్యే వర్మకు టీడీపీ అన్యాయం చేసిందంటూ మండిపడ్డారు. తెలుగుదేశం, జనసేన పొత్తులో భాగంగా పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నట్టు మంగళగిరిలో జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకే టిక్కెట్ వస్తుందని భావించిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా భగ్గుమన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు, ఇతర సామగ్రిని రోడ్డుపై వేసి దహనం చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వర్మను పార్టీ నమ్మించి మోసగించిందని ఆవేదన వ్యక్తంచేశారు. పవన్‌ను ఓడించి తీరతామని స్పష్టంచేశారు. వర్మను ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని, తామంతా కష్టపడి పనిచేసి గెలిపించుకుంటామని తెలిపారు. తమ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ కార్యకర్తలు, నాయకులకు అండగా నిలిచిన వర్మకు ఇంత అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు. కార్యకర్తలు, నాయకుల ఆందోళనతో పిఠాపురం టీడీపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కనీసం జనసేనకు టిక్కెట్టు ఇస్తున్నట్టు చెప్పకపోవడంపై వారు మండిపడ్డారు.

భావోద్వేగానికి గురైన వర్మ

పిఠాపురం అసెంబ్లీ టిక్కెట్టు తనకే వస్తుందని ధీమాగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వర్మ పవన్ ప్రకటన అనంతరం పరిణామాలతో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. నాయకులు, కార్యకర్తలు వచ్చి తీవ్ర ఆగ్రహావేశాలతో మాట్లాడడంతోపాటు వర్మకు భరోసా ఇస్తూ మాట్లాడడంతో కన్నీరు పెట్టుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా సంయమనం పాటించాలని, చేతులెత్తి నమస్కరించి కోరుతున్నానంటూ ఉద్వేగంతో మాట్లాడలేకపోయారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ను ఎవరూ దూషించవద్దని కోరారు. ఇక్కడే పుట్టి పెరిగానని, 20 ఏళ్లుగా కుటుంబాన్ని, వ్యాపారాన్ని వదులుకుని నియోజకవర్గ ప్రజలే తన కుటుంబంగా భావించి, ప్రతి ఇంటి పెద్దకొడుకుగా కష్టించి పనిచేశానని చెప్పారు. ఓడిపోయిన మరుసటి రోజు నుంచే ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో తోడుగా ఉన్నానని తెలిపారు. తనతోపాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అదేవిధంగా పనిచేశామని చెప్పారు. తన సతీమణి, పిల్లలు వద్దన్నా కరోనా సమయంలో ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలోని వార్డు ప్రాణాలు తెగించి తిరిగి శానిటేషన్ చేశానని తెలిపారు. నేను ఎటువంటి వ్యక్తినో, ప్రజల కోసం ఎలా కష్టపడ్డానో, ప్రజాసమస్యలపై ఎలా పోరాడానో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. పవన్‌కు దీనికి ఎటువంటి సంబంధం లేదని, ఇది టీడీపీ వ్యవహారమని చెప్పారు.

నేడు కార్యకర్తల సమావేశం

భవిష్యత్తు కార్యక్రమంపై నిర్ణయం కోసం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం మధ్యాహ్నం సమావేశం ఏర్పాటు చేశారు. కార్యకర్తలు ఏర్పాటుచేసుకున్న సమావేశానికి తాను హాజరవుతున్నానని మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల అభీష్టం మేరకు పనిచేస్తానని, ఈ సమావేశంలో వారు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని ప్రకటించారు.



పార్టీ కార్యాలయంలో వర్మ సమక్షంలోనే ఆందోళన

మాజీ ఎమ్మెల్యే వర్మకు చంద్రబాబు ఫోన్ :
తొందరపాటు నిర్ణయాలు వద్దని సూచన

పిఠాపురం, మార్చి 14: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురువారం రాత్రి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మకు ఫోన్ చేశారు. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో జరిగిన పరిణామాలతో చంద్రబాబు వర్మకు ఫోన్ చేసి మాట్లాడారు. తొందరపడి ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పారు. అన్ని విషయాలు మాట్లాడదామని, టీడీపీ కేంద్ర కార్యాలయానికి రావాలని సూచించారు. అయితే శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశం ఏర్పాటుచేసుకున్నారని, అందులో పాల్గొన్న తర్వాత లేదా శనివారం వస్తానని చంద్రబాబుతో వర్మ చెప్పినట్టు సమాచారం. చంద్రబాబు ఫోన్ చేసిన విషయాన్ని తెలుగుదేశం పార్టీ వర్గాలు ధ్రువీకరించాయి.

సాధారణ గిరిజన మహిళకు
టీడీపీ ఎమ్మెల్యే టికెట్

రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా అంగన్‌వాడీ కార్యకర్తను ఎంపిక చేసిన చంద్రబాబు



ఎన్టీఆర్‌కు నమస్కరిస్తున్న శిరీషా

రంపచోడవరం, మార్చి14: రంపచోడవరం టీడీపీ అభ్యర్థినిగా మిరియాల శిరీషాదేవి అనే విద్యావంతురాలైన గిరిజన యువతిని ఖరారు చేస్తూ తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు గురువారం నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే విషయంలో తీవ్ర స్థాయిలో వడబోత సాగించి పార్టీ ఎట్టకేలకు మిరియాల శిరీషను ఎంపిక చేసింది. ఇక్కడ టికెట్ కోసం ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న వంతల రాజేశ్వరి, పార్టీలోని సీనియర్ నాయకులు కూడా ప్రయత్నాలు సాగించారు. కాగా అరకు పార్లమెంట్‌కు బీజేపీ తరపున బరిలో నిలుస్తున్న కొత్తపల్లి గీత ఆశీస్సులు మెండుగా ఉండటం మిరియాల శిరీషకు కలిసి వచ్చింది. మిరియాల శిరీష కోయ సామాజిక వర్గానికి చెందిన మహిళ. గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన చోడి మల్లికార్జున, కారం బాపన్నదొరలతో ఆమె కుటుంబానికి బంధుత్వం ఉంది. విలీన మండలాలతో కలిపి నియోజకవర్గంలో ఆమె సామాజిక వర్గం ఓటర్లు అధికంగా ఉండటం, ఆమె భర్త సామాజిక వర్గం కూడా సానుకూలంగా మారి ఆమెకు కలిసివచ్చే అంశంగా ఉంది. డిగ్రీతో పాటు బీఈడీ చేసిన ఆమె అంగన్వాడీ కార్యకర్తగా గతంలో పనిచేశారు. అయితే ఎమ్మెల్సీ అనంతబాబు వేధింపులతో ఆమె ఆ పోస్టుకు రాజీనామా చేశారు. శిరీష అత్తమామలు అనంతగిరికి సర్పంచ్‌లుగా పని చేశారు. ఆమె భర్త మఠం విజయభాస్కర్ తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

టీచర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సర్పవరం జంక్షన్, మార్చి 14: కాకినాడ రూరల్ వలసపాకల కేంద్రీయ విద్యాలయంలో వివిధ ఉపాధ్యాయుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ బొంత శేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన సోషల్ స్టడీస్ కంప్యూటర్స్, సైన్స్, ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ, నర్స్, స్పోర్ట్స్ కోచ్, కౌన్సిలర్ తదితర పోస్టుల భర్తీ కోసం ఈనెల 16న శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పోస్టుల కోసం అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు విద్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకి శనివారం ఉదయం 8.30 గంటలకు సంబంధిత విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం విద్యాలయ వెబ్‌సైట్ www.kakinada.kvs.ac.inలో పరిశీలించుకోవాలన్నారు.

శునకాలు దాడి చేయడంతో బైక్‌తో గోడను ఢీకొన్న విద్యార్థి

తలకు తీవ్రమైన గాయం కావడంతో మృతి



మోహనకృష్ణ

యానాం, మార్చి 14: ఒక్కసారిగా శునకాలు దాడి చేయడంతో ఓ విద్యార్థి భయపడి బైక్‌తో గోడను ఢీకొట్టి చనిపోయాడు. ఈ విషాదకర సంఘటన యానాంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల వివరాల మేరకు యానానికి చెందిన విద్యార్థి వంటపాటి శివమోహన కృష్ణ (19) తండ్రి శ్రీనివాస్ (గాంధీ) స్థానిక ఫైర్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున శ్రీనివాస్‌కు జెర్రి కుట్టడంతో కుమారుడు మోహనకృష్ణతో కలిసి యానాం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. అయితే శ్రీనివాస్‌ను కొంత సమయం ఆస్పత్రిలోనే ఉండమని వైద్యులు సూచించడంతో అక్కడే ఉండిపోయాడు. అయితే మోహనకృష్ణకు పరీక్షలు ఉండటంతో చదువుకోవడానికి ఇంటికి వెళ్లిపొమ్మని శ్రీనివాస్ చెప్పాడు. దీంతో అక్కడే ఉన్న బైక్‌తో తిరిగి వస్తుండగా ఫైర్‌స్టేషన్ సమీపంలో కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. వాటి నుంచి తప్పించుకోబోయి ఫైర్‌స్టేషన్ గోడను బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో ఉన్న అతడిని యానాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మోహనకృష్ణ మృతి చెందాడు. మోహనకృష్ణ యానాం అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. కుక్కలను నిరోధించకపోవడం వల్లనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదంలో గోదావరి డెల్టా ఇరిగేషన్ వ్యవస్థ

- నిర్వహణ నిధులు లేక లాకులన్ని అస్తవ్యస్తంగా ఉన్నాయి
- కాల్వల్లో పూడిక పేరుకుపోయి నీరు ముందుకుపోవడం లేదు
- ప్రభుత్వం నిర్వహణ నిధులు కూడా ఇవ్వకపోతే ఎలా!
- కనీసం రంగులు, గ్రీజుకు సైతం నోచుకోని వైనం
- ఇలాగైతే డెల్టా ప్రాంతం బీడుగా మారిపోతుంది
- జీఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీ రంగస్వామి



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద కాల్వతొట్టెను పరిశీలిస్తున్న రంగస్వామి

పి.గన్నవరం, మార్చి 14: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని గోదావరి డెల్టాల్లో ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా ప్రమాదంలో ఉందని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ అలగేషన్ రంగస్వామి హెచ్చరించారు. కాల్వలన్ని అస్తవ్యస్తంగా ఉన్నాయని లాకుల తలుపులు కనీసం రంగులు, గ్రీజుకు కూడా నోచుకోని పరిస్థితులు ఇక్కడ కనిపిస్తున్నాయని చెప్పారు. ఇక్కడ ప్రభుత్వం కనీసం నిర్వహణ నిధులు కూడా మంజూరు చేయలేదా అని ఆయన ప్రశ్నించారు. కాల్వల విషయంలో ఇదే ఒరవడి కొనసాగితే రాబోయే రోజుల్లో డెల్టా ప్రాంతం భూములన్ని పూర్తిగా బీడుగా మారిపోతాయని ఆయన ప్రభుత్వాన్ని పరోక్షంగా హెచ్చరించారు. గోదావరి డెల్టాప్రాంతంలోని రెండు రోజులు పర్యటనలో భాగంగా గురువారం పి.గన్నవరం అక్విడెక్టును ఆయన పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. మొదటిరోజు ద్రాక్షారామ, రావులపాలెం, మండపేట, కాకినాడ కెనాల్, సామర్లకోట, లొల్లలాకులు, రెండో రోజు నర్సాపురం, వేల్పూరు కెనాల్, అంతర్వేది గోదావరి సాగర సంగమం తదితర ప్రాంతాలను పరిశీలించడంతో పాటు పది నుంచి పన్నెండు లాకులను, ముఖ్యమైన ప్రాంతాలను పరిశీలించామన్నారు. ఈ పరిశీలనలో ఎక్కడ చూసిన ప్రభుత్వం నుంచి నిర్వహణ నిధులు రావడం లేదని చెబుతున్నారన్నారు. లాకుల తలుపులన్ని పూర్తిగా తుప్పుపట్టి చాలా దుర్భరంగా ఉన్నాయన్నారు. కొన్ని చోట్ల అయితే తలుపులు సిస్టం పూర్తిగా దెబ్బతిందన్నారు. కాల్వలన్ని పూర్తిగా తూడు, పూడికతో అత్యంత దయనీయంగా ఉన్నాయని చెప్పారు. తక్కువ నీరును విడుదల చేసినప్పటికి పూర్తిస్థాయిలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా ఉండాలని కానీ ఇక్కడ అందుకు భిన్నంగా కాల్వలు ఉన్నాయని చెప్పారు. తూడు, పూడికతీత తొలగించడానికి నిధులు లేవని చెబుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఇరిగేషన్ వ్యవస్థకు పెద్ద మొత్తంలో ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని ప్రభుత్వం కూడా భారీ మూల్యం చెల్లించుకోవల్సిందేనని చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఆదిలోనే చర్యలు తీసుకుంటే వ్యవస్థ మారుతుందన్నారు. ఈఈ బత్తుల వెంకటస్వామి, పి.గన్నవరం డీఈ వెంకటేశ్వరరావు, నర్సాపురం డీఈ సత్యనారాయణ, జేఈ సుందర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

పుదుచ్చేరి వరకు సర్కారు ఎక్స్‌ప్రెస్



సామర్లకోట, మార్చి 14: కాకినాడ-చెంగల్పట్టు-కాకినాడ మధ్య రాకపోకలు సాగిస్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఇక నుంచి పుదుచ్చేరి వరకు నడవనుంది. సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకు పొడిగించడం యానాం ప్రజల చిరకాల వాంఛ. సామర్లకోట మీదుగా సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు రాకపోకలు సాగించనుండడంతో సామర్లకోట పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది రైలు ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరనుంది. ఈ మేరకు సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారులకు రైల్వే సీపీటీఎం అధికారి నుంచి అందిన ఆదేశాలను గురువారం రాత్రి ఆంధ్రజ్యోతి సేకరించింది. 17652 నంబరు గల కాచిగూడ-చెంగల్పట్టు-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు పుదుచ్చేరి వరకూ వారంలో మూడు రోజుల పాటు ఆదివారం, బుధవారం, గురువారంలో పుదుచ్చేరి వరకూ వెళ్లనుంది. 17651 నంబరు గల చెంగల్పట్టు-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు పుదుచ్చేరి నుంచి కాచిగూడ వరకూ వారంలో మూడు రోజుల పాటు అనగా సోమవారం, గురువారం, శుక్రవారంలలో వెళ్లనుంది. 17644 నంబరు గల కాకినాడ-చెంగల్పట్టు మధ్య రాకపోకలు సాగిస్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-పుదుచ్చేరి మధ్య ఆదివారం, బుధవారం, గురువారం నడవనుంది. మిగిలిన నాలుగు రోజులలో అనగా సోమవారం, మంగళవారం, శుక్రవారం, శనివారాలలో కాకినాడ-చెంగల్పట్టు మధ్య మాత్రమే రాకపోకలు సాగిస్తుంది. 17643 నంబరు గల చెంగల్పట్టు-కాకినాడ మధ్య రాకపోకలు సాగిస్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు చెంగల్పట్టు-కాకినాడ మధ్య మిగిలిన నాలుగు రోజులు అనగా మంగళవారం, బుధవారం, శనివారం, ఆదివారంలో రాకపోకలు సాగించనుంది. ఈ మేరకు గురువారం పుదుచ్చేరి-కాచిగూడ మధ్య పొడిగించిన రైలు ప్రారంభమైంది. ఈనెల 15న కాకినాడ-చెంగల్పట్టు మధ్య ఈ నెల 16న చెంగల్పట్టు-కాకినాడ మధ్య పొడిగించిన రైళ్లు ప్రారంభం కానున్నాయి. మరిన్ని వివరాలకు సమీప రైల్వే స్టేషన్‌లో బుకింగ్ కార్యాలయం నందు సిబ్బంది ద్వారా తెలుసుకోవచ్చని, పాత టైమింగ్స్‌లోనే రైలు రాకపోకలు సాగించనందని రైల్వే అధికారి కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వులలో తెలిపారు. కాగా కాకినాడ, సామర్లకోట మీదుగా పుదుచ్చేరి ప్రాంతానికి ఏకైక ఎక్స్‌ప్రెస్ రైలుగా సర్కార్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే కావడం విశేషం.

దేవదాయ శాఖ మంత్రి పర్యటన వాయిదా

అన్నవరం, మార్చి 14: అన్నవరం దేవస్థానంలో శుక్రవారం జరగాల్సిన దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పర్యటన వాయిదా పడినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. జాతీయ రహదారిపై నమూనాలయం వద్ద ప్రసాదం కౌంటర్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను సిద్ధం చేయగా ఆకస్మికంగా మంత్రి కార్యాలయం నుంచి దేవస్థానం అధికారులకు కార్యక్రమం శనివారానికి వాయిదా వేసినట్లు వర్తమానం రావడంతో శనివారానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా అశోక్

కాకినాడ సిటీ, మార్చి 14: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా కాకినాడకు నగరానికి చెందిన బసవా అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 16 మంది ఏపీఐఐసీ డైరెక్టర్లను నియమిస్తూ గురువారం జీవో నంబర్ 66 జారీ చేసింది. ఈ సందర్భంగా తనను డైరెక్టర్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతలకు చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మార్చి 14: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన పి.మిథుల్‌చక్రవర్తి-ఉషాకిరణ్ దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. దాతలకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా గురువారం ఒక్కరోజు ఆదాయం రూ.1,89,576 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. దేవస్థానంలోని హుండీలను ఈ నెల 20వ తేదీ ఉదయం పది గంటలకు పర్యవేక్షణాధికారుల సమక్షంలో తెరిచి లెక్కిస్తామని ఆయన చెప్పారు.

యువకుడిపై పోక్సో కేసు

ఆత్రేయపురం, మార్చి 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలికను ఉండ్రాజవరం మండలం పాలంగికి చెందిన కడలి దుర్గాప్రసాద్ ఫోన్ చేసి వేధిస్తున్నాడు. ఆన్‌లైన్‌లో ఫొటోలు పెడతానని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. బాలిక ఫొటోను ఫ్లెక్సీపై అంటించి ఫోన్ నెంబరు వేశారు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ముమ్మిడివరం, మార్చి 14: 58 సంవత్సరాల క్రితం ఎస్ఎస్ఎల్‌సీ చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం ముమ్మిడివరంలో తాము విద్యను అభ్యసించిన పాఠశాలలో కలుసుకున్నారు. ముమ్మిడివరం జడ్పీ హైస్కూల్‌లో 1966-69 సంవత్సరంలో ఎస్ఎస్ఎల్‌సీ చదివిన పూర్వ విద్యార్థులు 80 మంది ఒక్కచోట సమావేశమై చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆప్యాయంగా పలకరించుకుని ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు తెచ్చుకుంటూ ఆ తియ్యటి జ్ఞాపకాలతో ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడిపారు. నాటి గురువులు పోర్ల సుబ్బారావు, పుల్లెల భీమశంకరం, చివుకుల రాము, సీహెచ్‌వీఆర్కే ఆచార్యులను సత్కరించారు. పోర్ల కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూకల శంకరం, గంటా సత్యనారాయణ, కుందూరు విశ్వప్రసాద్, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

పోలీసుల సంరక్షణలో బాలుడు

ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని కోరిన పోలీసులు



సామర్లకోట, మార్చి 14: సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డుపై అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్న పది సంవత్సరాల వయస్సు గల బాలుడిని గురువారం సాయంత్రం సామర్లకోట పోలీసులు సంరక్షించారు. బాలుడి తల్లితండ్రులు ఎవరనే విషయమై పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి వద్ద ఉన్న పుస్తకంలో బి. ప్రభ అని మాత్రమే ఉందని బాలుడు నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదని పోలీసులు తెలిపారు. బాలుడి ఫొటోతో మహిళా పోలీసులు పలు ప్రసార మాధ్యమాలలో ప్రసారం చేశారు. ఆచూకీ తెలిసిన వారు సామర్లకోట పోలీస్‌స్టేషన్‌కు రావాలని పోలీసులు కోరారు.

18 ఇసుక లారీలు పట్టివేత



పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఇసుక లారీలు

ఎటపాక, మార్చి14 తెలంగాణలోని ర్యాంపు నుంచి ఇసుక రవాణా చేస్తున్న 18 ఇసుక లారీలను గురువారం రాష్ట్ర సరిహద్దులోని ఎటపాక పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం, తూరుబాక ఇసుక ర్యాంపు నుంచి ఇసుకను ఆంధ్రా మీదుగా తెలంగాణకు తరలిస్తుండగా పోలీసులు నిలుపుదల చేశారు. అయితే ఇసుక లారీలకు వేబిల్లులు, సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో పట్టుకున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. పట్టుకున్న లారీలను రహదారి పక్కకు నిలిపి, అనుమతి పత్రాలను పరిశీలిస్తున్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

ముమ్మిడివరం, మార్చి 14: పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సాల్ట్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆషిక్ అలీబేగ్ సూచించారు. ముమ్మిడివరం మండలం ఠాణేలంకలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం ఆయన సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావుతో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆలీబేగ్ మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో భాగంగా జిల్లాలో ఎంపికచేసిన వివిధ యాజమాన్యాల పాఠశాలలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినులకు భద్రత ఏవిధంగా ఉంది, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, వసతి ఎలా ఉంది, పాఠశాలలో లైబ్రరీ ఏవిధంగా ఉపయోగపడుతుంది, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు విద్యార్థులకు ఏ మేరకు వినియోగించుకుంటున్నారు, మౌలిక వసతులు ఏవిధంగా ఉన్నాయి తదితర అంశాలను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో కిచెన్, వంట షెడ్లు, డైనింగ్ హాలు, తరగతి గదులు, టాయిలెట్లను పరిశీలించారు. వారి వెంట సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు, సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పొట్లవాయిగూడెంలో చోరీ

కూనవరం,మార్చి14: మండలంలోని పొట్లవాయిగూడెంలో ఓ గిరిజనుడి ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కుడియం వెంకటేష్ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే చొరబడి రూ.20 వేలు దొంగలించారు. వెంకటేష్ యథావిధిగా ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చాక ఇంటి ముందు తాను పెంచుకున్న రెండు కోడిపుంజులు కనిపించలేదు. అయితే అవి ఎక్కడికిపోయాయని చుట్టుపక్కల వెతికాడు. ఈలోగా ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా ఇటీవల వ్యవసాయంలో వచ్చిన రూ.20 వేలు సొమ్ము కనపడలేదు. దీంతో వెంకటేష్ తన ఊరి పరిధిలో ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలించగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై తిరిగినట్లు ఫుటేజీలో కనపడుతుంది. వారిని అనుమానితులుగా భావిస్తున్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

అందరి సహకారంతో ముందుకెళ్తా

రంపచోడవరం టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషాదేవి



గ్రామంలో ఆలయాన్ని సందర్శించిన శిరీషాదేవి

రాజవొమ్మంగి మార్చి 14: రంపచోడవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మిరియాల శిరీషాదేవి పేరు ఖరారవడంతో టీడీపీ నాయకులు సందడి చేశారు. ఆమె రాజవొమ్మంగి మండలానికి చెందిన మహిళ కావడంతో పండుగ వాతావరణం నెలకొంది. బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. మిరియాల శిరీషాదేవి, ఆమె భర్త తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ టీడీపీ నాయకులతో కలిసి గురువారం మధ్యాహ్నం రాజవొమ్మంగి గ్రామ దేవత నూకాలమ్మ అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నాయకులు గణజాల తాతారావు, జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ముప్పన కేశవ్, వాశంశెట్టి గంగాధర్, లోకేష్, ముప్పన మోహన్, ముప్పన సావిత్రి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా శిరీష ఎంపికతో హర్షం

రంపచోడవరం, మార్చి 14: తెలుగుదేశం పార్టీ రంపచోడవరం అభ్యర్థిని మిరియాల శిరీషాదేవి గురువారం సాయంత్రం నుంచి తన పర్యటనలను ప్రారంభించారు. ఇందులో భాగంగా రంపచోడవరం వచ్చిన ఆమె రంపచోడవరంలోని దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్‌లను కలిశారు.

పార్టీ అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం

చింతూరు, మార్చి 14 : టీడీపీ కూటమి అభ్యర్థిగా మిరియాల శిరీషాదేవి ఎంపిక పట్ల చింతూరు మండల తెలుగుదేశం పార్టీ హర్షం వ్యక్తం చేసింది. మండల అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి మాట్లాడారు. అభ్యర్థి గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. మల్లెల వెంకటేశ్వరరావు, ఆకోజు నూకాచారి, నర్సింహారావు, తుర్రం చిన్నముత్తయ్య, గద్దం సురేష్‌కుమార్, ముత్యాల శ్రీరాం, పసుపులేటి సాల్మన్‌రాజు, అనిగి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

శిరీషాకు టికెట్ ఇవ్వడంపై హర్షం

వరరామచంద్రాపురం, మార్చి 14: రంపచోడవరం నియోజకవర్గం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా మిరియాల శిరీషాను ఎంపిక చేయడం పట్ల మూడు పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు ముత్యాల రామారావు, జడ్పీటీసీ సభ్యుడు వాళ్ళ రంగారెడ్డి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు ముత్యాల రాంబాబు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బీరక సూర్యప్రకాష్‌రావు, మండల కార్యదర్శి బురక కన్నారావు, ఐటీడీపీ మండల కన్వీనర్ ముత్యాల సిద్ధు, మండల కోశాధికారి పెందుర్తి సుదర్శన్, సవలం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం

కూనవరం, మార్చి 14: రంపచోడవరం టీడీపీ అభ్యర్థిగా మిరియాల శిరీషను ప్రకటించడంపై టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శిరీష ప్రకటనతో వైసీపీ నాయకులు భయపడుతున్నారన్నారు. చంద్రబాబు ఆదేశాల మేరకు ఆమెను బంపర్ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. డీపీ మండలాధ్యక్షుడు బరపాటి ప్రకాశ్, ఇంటి భాస్కరరావు, కూనవరం సర్పంచ్ జనసేన నాయకులు హేమంత్, బీజేపీ నాయకులు నోముల సత్యనారాయణ పాల్గొన్నారు.

అలకబూనిన మాజీ ఎమ్మెల్యేలు

రంపచోడవరం, మార్చి14: రంపచోడవరం తెలుగుదేశం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేష్, వంతల రాజేశ్వరి మౌనముద్రలో ఉన్నారు. ఈ విషయంలో ముగ్గురూ ఎటువంటి వ్యాఖ్యలు చేయకుండా మౌనంగానే ఉండిపోయారు. అయితే సమయానుకూలంగా స్పందిస్తామన్న సంకేతాలను మాత్రం ఇస్తున్నారు. కాగా ఇక్కడ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన తీరు పట్ల వారు అసంతృప్తితో ఉండి అలకబూనినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

జనసేన ఆవిర్భావ వేడుకలు

చింతూరు, మార్చి 14 : చింతూరు లో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు మడివి రాజు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు కాకి మధు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ .జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పయ్యాల నాగేశ్వరరావు, తీగల రవి, చిలకం కన్నారావు, దేవీపట్నం మండల అధ్యక్షుడు వెంకటరాయుడు, చోడవరం ఉపాధ్యక్షుడు రాగాల సురేష్, సీనియర్ నాయకుడు చుప్పల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి మండలంలో..

రాజవొమ్మంగి మార్చి 14: మండలంలో గురువారం జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలను టీడీపీ, జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. రాజవొమ్మంగి జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు జనసేన జెండాను ఆవిష్కరించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి జనసేన టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, జనసేన యూత్ ప్రెసిడెంట్ కొచ్చా లోకేష్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ముప్పన కేశవ్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఆవిర్భావ వేడుకలు

వరరామచంద్రాపురం, మార్చి 14: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ ఆధ్వర్యంలో రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. జీడిగుప్ప గ్రామంలో ఉపాధ్యక్షుడు కనుగుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో, శ్రీరామగిరి గ్రామంలో మండల యూత్ లీడర్ పరంకుశం మణికంట, జనసైనికుల ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు సాయికృష్ణ సమక్షంలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. బాగుల ప్రమీల, బాగుల అంజన్‌రావు, కోట్ల విజయరామరాజు, పవన్‌కల్యాణ్, జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, టీడీపీ నాయకులు ముత్యాల సిద్ధు, బీరక సూర్యప్రకాష్‌రావు, మండల కార్యదర్శి బురక కన్నారావు, మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ సివిక్స్ ప్రోగ్రాం

మోతుగూడెం, మార్చి14: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న ఫోర్ బై నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజు క్యాంపులో సీఆర్పీఎఫ్ మి/42 ఆధ్వర్యంలో సివిక్స్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎంవో42 బెటాలియన్ డాక్టర్ నితిన్ జెడ్డీ గురువారం రాజు క్యాంపులో గిరిజన కుటుంబాలకు చార్జింగ్ లైట్లు, వీధి లైట్లు, డ్రమ్ములు, మెడికల్ క్యాంప్, మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్థులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏ/42 బెటాలియన్ సతీష్‌కుమార్‌సింగిల్, మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు, సర్పంచ్ ఆకేటి సీత, సివిల్ పోలీస్ ఎస్ఐ రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత

చింతూరు, మార్చి 14 :ఔషధ మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయుర్వేద నిపుణులు జమాల్‌ఖాన్ చెప్పారు. జమాల్ ఖాన్ ఔషద మొక్కల పరిశోధన కేంద్రంలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. జమాల్‌ఖాన్ ఆయుర్వేద క్షేత్రంలో సాగు చేస్తున్న ఆయుర్వేద మొక్కలతో పాటు కూరగాయలు, పండ్ల తోటలను పరిశీలించారు.

నేడు హుకుంపేటలో జయహో బీసీ సభ

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 14: ఈ నెల 15న రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట జంక్షన్ డీమార్ట్‌ను ఆనుకుని ఉన్న ప్రాంగణంలో జరిగే జయహో బీసీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన బీసీ ప్రముఖులు హాజరు కానున్నారని, రూరల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఐటీడీపీ సభ్యులు, అనుబంధ సంఘాలు హాజరు కావాలని కోరారు.

రోగులకు పెట్టే భోజనంపై ఇంత అశ్రద్ధా?



ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

» టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
» అనపర్తి ఏరియా ఆసుపత్రి సందర్శన

అనపర్తి, మార్చి 14: అనపర్తి ఏరియా ఆసుపత్రిలో రోగులకు చేస్తున్న అరకొర, నాసిరకం ఆహారం సరఫరాపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడి వైద్యులను నిలదీశారు. గురువారం ఆసుపత్రిని సందర్శించిన ఆయన నాసిరకం భోజనం సరఫరాపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించాల్సి ఉండగా ఒక్కపూట భోజనంతో ఎలా సరిపెడుతున్నారని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా ఇప్పటివరకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎందుకు స్పందించడంలేదన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయడమంటే ఇదేనా? వైద్యుడిగా ఉన్న ఎమ్మెల్యే ఆసుపత్రిలో రోగులకు జరుగుతున్న అన్యాయంపై స్పందించకుంటే ఎలా అంటూ ప్రశ్నించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి మాట్లాడుతూ వివరాలను ఉన్నతాధికారులకు నివేదించామని, కాంట్రాక్టరుకు చెల్లించాల్సిన బిల్లు నిలుపుదల చేయాల్సిందిగా జిల్లా వైద్య సేవల అధికారిణి డాక్టర్ సనత్ కుమారి ఆదేశాలు జారీ చేశారన్నారు. రోగులకు అందించే ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, ఉదయం అల్పాహారంతో బాటు మధ్యాహ్నం భోజనంలో నాణ్యత ఉండే విధంగా చర్యలు చేపట్టామని రామకృష్ణారెడ్డికి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీలో రూ.150 కోట్ల కుంభకోణం

ఏపీపీఎస్సీలో ఉద్యోగాలను సంతలో పశువులు అమ్ముకున్నట్లుగా జగన్‌రెడ్డి ప్రభుత్వం అమ్ముకుందని, ఈ అక్రమాలు హైకోర్టులో బహిర్గతమయ్యాయని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్టును రూ.2.50 కోట్లకు, డీఎస్పీ పోస్టును రూ.1.50 కోట్లకు అమ్ముకున్న ఘనత వైసీపీ ప్రభుత్వానిదని తేటతెల్లమైందన్నారు. 30 డిప్యూటీ కలెక్టర్లు, 25 డీఎస్పీ పోస్టుల అక్రమ భర్తీకి పాల్పడిన ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు, ఛైర్మన్ సవాంగ్ గౌతమ్‌లపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇంత జరిగాక ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా సీఎం జగన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాన్యువల్ మూల్యాంకనం చేయకుండా డిజిటల్ మూల్యాంకనం చేపట్టి అక్రమాలకు తెరదీశారన్నారు.

ఆవ స్కాం-2కు తెరలేపిన ఎంపీ భరత్

దోచుకున్న ప్రజాధనంతో ఎన్నికలకు సమాయత్తం

టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 14: ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆవ స్కామ్-2కు తెరలేపారని టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు ఆరోపించారు. రాజమహేంద్రవరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఆవ భూముల విషయంలో చేసిన అవినీతి అందరికీ తెలిసిన విషయమేనని, ఇప్పుడు కానవరం, పల్లకడియం, బూరుగుపూడి ప్రాంతాల్లో మళ్లీ కొత్తగా 500 ఎకరాలు సేకరించిన ఎంపీ భరత్ ఆవస్కామ్-2కు తెరలేపి ఖాళీ అయిన తన ఖజానాను నింపుకునేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. ఎక్కువ ధరకు ప్రభుత్వంతో రైతుల నుంచి భూములు కొనుగోలు చేయించే తతంగమంతా పూర్తయిన తర్వాత రైతుల నుంచి అధిక మొత్తంలో వెనక్కి తీసుకునేలా బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేస్తున్నాడన్నారు. గతంలో ఆవ భూముల్లో దోచుకున్న సొమ్ములో కొంత సీఎం జగన్‌కు ఇవ్వగా మిగిలిన దానితో ఇప్పటివరకు ఫ్లెక్సీలు, పబ్లిసిటీ, చీరలు పంపిణీ చేసి రాజకీయాలు చేశాడని, ఖాళీ అయిన ఖజాను నింపుకోవడానికి రెండు రోజులుగా సీఎంవో కార్యాలయంలో కూర్చుని ఫైనాన్స్ విభాగం నుంచి నిధులు మంజూరు చేయించి భూములు విక్రయించిన రైతులకు తక్కువ ఇచ్చి మిగిలిన సొమ్మును ఈ ఎన్నికల్లో ఖర్చుచేసేందుకు ఎంపీ భరత్ ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు.

జనసేన ఆవిర్భావ వేడుకలు

కడియం, మార్చి 14: జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలను జనసైనికులు కడియంలో గురువారం ఘనంగా నిర్వహించారు. దేవీచౌక్ సెంటర్‌లో ఉన్న జనసేన స్థూపం వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. కేకు కట్ చేసి సంబరాలు చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు ముద్రగడ జమీ మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమం, ప్రజా శ్రేయస్సు కోసం జనసేన పార్టీ ఏర్పడిందన్నారు. ఎటువంటి వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించకుండా పవన్‌కళ్యాణ్ పార్టీని స్థాపించి తన జీవితాన్నే ప్రజలకు అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో చిలుకూరి నాగేశ్వరరావు, తోరాటి వసంతరావు, పాటంశెట్టి రామ్‌జీ, కలిదిండి గోవిందు, ముద్రగడ సుధ, మార్గాని ఏడుకొండలు, మర్రి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కలిసి కట్టుగా పనిచేద్దాం.. విజయం సాధిద్దాం

» టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశంలో బత్తుల



సమావేశంలో బత్తుల, బీవీఆర్ చౌదరిలను సత్కరిస్తున్న దృశ్యం

కోరుకొండ, మార్చి 14: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేసి విజయం సాధిద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పిలుపునిచ్చారు. గురువారం రాత్రి బూరుగుపూడి ద్వారకామాయి కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు పార్టీ నాయకులు కలిసికట్టుగా పని చేసి చంద్రబాబును సీఎంగాను, బలరామకృష్ణను ఎమ్మెల్యేగాను గెలిపించుకుంటామని ప్రమాణం చేశారు. అధికార వైసీపీ దుష్ప్రచారం నమ్మవద్దనికాపు, కమ్మ, బీసీ, ఎస్సీ అనే బేధం లేకుండా అందరూ ఐకమత్యంగా పనిచేయాలని బీవీఆర్ చౌదరి పిలుపునిచ్చారు. శుక్రవారం నుంచి నియోజకవర్గంలో రోజుకు ఐదు గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని బత్తుల చెప్పారు. రానున్న 45రోజులు ఎంతో కీలకమని, రాక్షసపాలన అంతం చేయడానికి ప్రతిఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, మళ్ళ అప్పలనర్సారావు, బదిరెడ్డి సత్యనారాయణమూర్తి, రొంగల శ్రీనివాస్, మాతా సీతారాముడు, బత్తుల వెంకటలక్ష్మి, అడపా శ్రీనివాస్, అడ్డాల శ్రీను, బదిరె డ్డి దొర, మేడిశె ట్టి శివరాం, కమిడి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ఘోర ప్రమాదం

గ్రానైట్ లారీని ఢీకొన్న రొయ్యల లారీ.. ఓ వ్యక్తి దుర్మరణం



ప్రమాద దృశ్యం, ఘటనా స్థలంలో మృతుడు.. రొయ్యల లోడు లారీ డ్రైవర్ నాగరాజు

రాజమహేంద్రవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. త్రీటౌన్ ఎస్ఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. గుడివాడ నుంచి ఓ లారీ పచ్చి రొయ్యల లోడుతో ఒడిశా బయలుదేరింది. డ్రైవరు జి.నాగవాసుతోపాటు అతడి స్నేహితుడు చంటిబాబు ఆ లారీలో ఉన్నారు. మార్గమధ్యలో గామన్ వంతెనపై గ్రానైట్ లోడుతో ఆగివున్న లారీని వీరి లారీ బలంగా ఢీకొట్టింది. గ్రానైట్ లారీ అధిక బరువుతో ఉండడంతో నాగవాసు లారీ తిరగబడి క్యాబిన్ నుజ్జునుజ్జయ్యింది. దీంతో డ్రైవర్ నాగరాజు ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. చంటిబాబుకు తీవ్రంగా గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. హైవేపై లారీలు నిలపకూడదనే నిబంధన ఉన్నప్పటికీ హైవే పెట్రోలింగ్ వాహనాలు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ చెప్పారు.

విద్యార్థులకు ఐన్‌స్టీన్ జీవితం దిక్సూచి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 14: విద్యార్థులకు ఐన్‌స్టీన్ జీవితం ఒక దిక్సూచి లాంటిదని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే అన్నారు. కళాశాలలో ఐన్‌స్టీన్ 145వ జయంతిని గురువారం నిర్వహించారు. ఐన్‌స్టీన్ భౌతికశాస్త్ర అభివృద్ధికి చేసిన కృషిని, సేవలను కొనియాడారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో రాణించడానికి మంచి ఆలోచనా దృక్పథం కలిగి ఉన్నప్పుడే వారు ఎంచుకున్న రంగంలో విజయాన్ని పొందుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి సీహెచ్ కోమల లక్ష్మి, బి.దుర్గాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి మద్దతు

రాజానగరంలో రైతు కూలీ సంఘం ప్రదర్శన



రాజానగరంలో ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం సభ్యులు

రాజానగరం, మార్చి 14: ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి మద్దతుగా ఎస్‌కేఎం పిలుపు మేరకు అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో గురువారం రాజానగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గత రైతాంగ ఉద్యమానికి మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతాంగ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహా పంచాయతీకి మద్దతుగా దీనిలో భాగంగా ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రాజానగరంలోని అన్నదాన సత్రం నుంచి బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించి, గాంధీబొమ్మ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రైతాంగ ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వ హత్యాకాండని ఖండించాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు, మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, గున్నారి అరవాలమ్మ, గోర్స దుర్గ, తోటకూర బేబీ, తామర్ల గౌరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ఎమ్మెల్యే రాజా



శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజా

దివాన్‌చెరువు, మార్చి 14: నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. దివాన్‌చెరువులో దాదాపు రూ.4 కోట్లతో చేపట్టనున్న ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణ పనులకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మల్టీస్పోర్ట్స్ ఇండోర్ స్టేడియాన్ని రెండంతస్తుల్లో నిర్మిస్తామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్ కోర్టులను, ఫస్ట్‌ఫ్లోర్‌లో క్రీడాకారులకు డార్మెంటరీ గదులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దూలంపెద్ద, వేమగిరి కృష్ణ, గంగిశెట్టి సోమేశ్వరరావు, మెట్ల ఏసుపాదం, యర్రంశెట్టి ధర్మరాజు, మార్గాని శ్రీను, పలివెల స్వామి, మందాల వెంకటేష్ పాల్గొన్నారు.

కారల్ మార్క్స్ వర్ధంతి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 14: సమాజంలో అన్ని సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపించిన మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. కారల్ మార్క్స్ 140వ వర్ధంతి సందర్భంగా గురువారం రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవ జాతి చరిత్ర అంతా అతీత శక్తులు, పుణ్య పురుషుల సృష్టిగా ఘోషిస్తుంటే దాన్ని తోసిరాజని మానవుడే చరిత్ర నిర్మాత అని చెప్పిన గొప్ప వ్యక్తి మార్క్స్ అని అన్నారు. మార్క్స్ మరణించి ఏళ్లు గడుస్తున్నా ఆయన చూపిన మార్గంలో కోట్లాది మంది పయనిస్తూనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో జట్ల సంఘం అధ్యక్షుడు కె.రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సప్పా రమణ, నల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి

డాక్టర్ అనసూరి పద్మలత

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 14: బీసీ మహిళ గీతాంజలి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సీఎం జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు బహిరంగ లేఖ పంపిస్తున్నానని బీసీ మహిళా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆమె లేఖను విడుదల చేశారు. ఎవ్వరిని మానసిక ఆందోళనకు గురి చేయకూడదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

పేదలకు చీరలు, పండ్లు పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మార్గాని


కడియం, మార్చి 14: కడియపులంక మార్గాని ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం వీరహనుమాన్ నర్సరీ వద్ద పేదలకు, వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. అలాగే వీరహనుమాన్ నర్సరీ వద్ద టీడీపీ శ్రేణులు, నర్సరీ రైతులు కలిసి కేకు కట్ చేశారు. మార్గాని సేవలను పలువురు అభినందించారు.

కంటి వ్యాధులపై అవగాహన


రాజానగరం, మార్చి 14: ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, జిల్లా అంధత్వ నివారణ సొసైటీ (రాజమండ్రి)సంయుక్త ఆధ్వర్యంలో మండలం లోని వెలుగుబంద గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కంటి వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు. కంటి చూపులో లోపాలు తలెత్తితే రాజమహేంద్ర వరం ప్రభుత్వాసుపత్రిలో కంటి పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని, వ్యాధు లను ముందుగా గుర్తించి సంరక్షించుకోవాలని కరపత్రాల ద్వారా సూచించారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ ఆఫీసర్ టి.ఆనందకుమార్, ఏఎన్ఎం జె.బుజ్జి, ఎన్ఎస్ఎస్ పీవో షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలులో సచివాలయ భవనం ప్రారంభం

బిక్కవోలు, మార్చి 14: బిక్కవోలులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలన్నీ సచివాలయాల్లోనే పరిష్కరించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరెళ్ల సుమలత, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, వైసీపీ నాయకులు గువ్వల సత్తిరెడ్డి, చిడం ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.



అల పిఠాపురాన..



నా గురువు జన్మస్థలం.. పిఠాపురం

2014లో జనసేన తరపున పిఠాపురం నుంచి పోటీ చేయమని చాలామంది అడిగారు. కానీ అప్పుడు కుదర్లేదు. అయితే ఇప్పుడు పిఠాపురం నుంచి పోటీచేయాలని నిర్ణయించుకున్నా. నా గురువైన దత్తాత్రేయుల అవతారమైన శ్రీపాద శ్రీవల్లభుడు జన్మస్థలమది. అది.. శక్తి పీఠం కూడా.. అక్కడి నుంచే పోటీ చేస్తా. ఎంపీగా పోటీ చేయాలా లేదా అనేది ఇంకా నిర్ణయించుకోలేదు.

- కొణిదెల పవన్‌కల్యాణ్, జనసేన అధినేత

రాజమండ్రి రూరల్

వైసీపీని ఓడించండి..



ప్రజలందరూ తాయిలాలు తీసుకోండి.. కానీ మన భవిష్యత్తు కోసం ఈ దుర్మార్గ ప్రభుత్వాన్ని ఓడించండి. మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సారథ్యంలో ముందుకుసాగుదాం. చదువుకున్న మేధావులంతా తప్పనిసరిగా ఓటు వేయాలి. ఓటు కొనేవారికి విలువ తెలపాలి.

- బుచ్చయ్యచౌదరి, టీడీపీ

రాజోలు

అభివృద్ధికి పాటుపడతా..



సీనియర్ ఐఏఎస్ అధికారిగా పనిచేసిన అనుభవంతో రాజోలు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లోనూ ప్రగతి పథంలో నడిపించడానికి కృషి చేస్తా. నియోజకవర్గ ప్రజల సహకారంతో జనసేన అభ్యర్థిగా ఘన విజయం సాధిస్తా. కూటమి ప్రభంజనం సృష్టిస్తుంది.

- దేవ వరప్రసాద్, జనసేన

ప్రత్తిపాడు

ప్రజా సంక్షేమానికి కృషి



నా భర్త రాజా ఆశయ సాధనకు, నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తా. నాకు టీడీపీ తరపున టిక్కెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

- వరుపుల సత్యప్రభ, టీడీపీ

కొవ్వూరు

గెలిచి బాబుకు గిఫ్ట్ ఇస్తా..



పాలకుడిగా కాదు.. సేవకుడిగా కొవ్వూరు నియోజకవర్గ ప్రజలకు సేవచేస్తా. టీడీపీ అధినేత చంద్రబాబు నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నియోజకవర్గ నాయకులందరినీ కలుపుకుని మంచి మెజార్టీతో గెలిచి కొవ్వూరును చంద్రబాబుకు గిఫ్టుగా ఇస్తా.

- ఎం.వెంకటేశ్వరరావు, టీడీపీ

గోపాలపురం

క్రమశిక్షణకు గుర్తింపు



టీడీపీలో క్రమశిక్షణతో పనిచేసే ప్రతి ఒక్కరి నిబద్ధతకు పట్టం కడతారు. కష్టకాలంలో పార్టీ కోసం కష్టించి పనిచేసే యువతను అధినేత చంద్రబాబు గుర్తిస్తారు. టిక్కెట్టు కేటాయించడం పట్ల అధినేత చంద్రబాబు, లోకేశ్‌లకు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు.

- ఎం. వెంకట్రాజు, టీడీపీ

రామచంద్రపురం

మంచి మెజార్టీతో గెలుస్తా



టీడీపీ జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఘన విజయం సాధిస్తాను. అన్ని వర్గాల ప్రజలను సంఘటితం చేసుకుని ఎన్నికల్లో వ్యూహాత్మకంగా పనిచేసి మంచి మెజార్టీతో గెలుస్తాను. వైసీపీపై ఉన్న వ్యతిరేకతను ఓటర్లలోకి తీసుకువెళ్లి వారి సహకారంతో గెలవడం తథ్యం.

- వాసంశెట్టి సుభాష్, టీడీపీ

రంపచోడవరం

దరఖాస్తు పెట్టుకున్నా..



రంపచోడవరం తెలుగుదేశం అభ్యర్థిగా ఎంపికవడం ఊహించని పెద్ద బాధ్యతగా భావిస్తున్నా. టీడీపీ తరపున అవకాశం ఇవ్వాలని దరఖాస్తు పెట్టుకున్నా. టీడీపీ అధినేత చంద్రబాబు యువతకు అవకాశం ఇవ్వాలన్న లక్ష్యం మేరకే సీటు ఇచ్చారు.

- శిరీషాదేవి, టీడీపీ

ఉమ్మడి తూర్పున స్థానాలు (పశ్చిమ స్థానాలతో సహా..)	22
ఇప్పటివరకూ ప్రకటన	20
టీడీపీ	15
జనసేన	5
మిగిలినవి	2

జిల్లాల విభజనలో భాగంగా పశ్చిమ నుంచి మూడు నియోజకవర్గాలు ఉమ్మడి తూర్పులో కలిశాయి.. రెండు టీడీపీ.. ఒక స్థానంలో జనసేన పోటీ చేస్తున్నాయి.

సమరమే..



- ఉమ్మడి జిల్లాలో మరో నాలుగు స్థానాలు ప్రకటన
- రాజమహేంద్రవరం రూరల్ సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్లకే
- పిఠాపురం నుంచి బరిలోకి పవన్.. వీడిన సస్పెన్స్
- రిటైర్డ్ ఐఏఎస్ వరప్రసాద్‌కు రాజోలు సీటు
- ఇప్పటి వరకు 20 స్థానాల్లో అభ్యర్థుల వెల్లడి
- టీడీపీ నుంచి 15 మంది, జనసేన నుంచి ఐదుగురు
- కాకినాడ సిటీ, అమలాపురం అభ్యర్థులపై ఉత్కంఠ
- పిఠాపురం, కొవ్వూరు సీట్లపై భగ్గుమన్న తమ్ముళ్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డంతో టీడీపీ, జనసేన పార్టీలు అభ్యర్థుల లెక్కలు తేల్చేశాయి. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న స్థానాల గుట్టు విప్పేశాయి. తొలివిడత జాబితాలో పెద్దగా తలనొప్పులు లేని సీట్లను ప్రకటించిన ఇరుపార్టీలు మలివిడత ప్రకటించాల్సిన జాబితాపై భారీ కసరత్తు జరిపాయి. సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల సామర్థ్యాలు, ప్రత్యర్థి పార్టీ బలాబలాలపై కొన్నిరోజులుగా విస్తృత కసరత్తు జరిపి ఎట్టకేలకు గురువారం గెలుపు గుర్రాలను ప్రకటించాయి. మొత్తం ఆరు స్థానాల్లో అభ్యర్థులపై స్పష్టత రాగా, ఇందులో టీడీపీ నాలుగు, జనసేన ఇద్దరు అభ్యర్థుల పేర్లను ప్రకటించాయి. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ స్థానాలకు రెండో జాబితాతో కలిపి మొత్తం 17 స్థానాల్లో అభ్యర్థుల పేర్లను రెండు పార్టీలు వెల్లడించాయి. ఇంకా కాకినాడ సిటీ, అమలాపురం సీట్లకు సంబంధించి బరిలో నిలబడేదెవరనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. కాగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేసే స్థానంపై ఇంతకాలం కొనసాగిన గందరగోళానికి తెరపడింది. దీనికి స్వయంగా పవన్ ఫుల్‌స్టాప్ పెట్టారు. పిఠాపురం నుంచి బరిలోకి దిగుతున్నట్టు ఆయనే వెల్లడించారు. అటు రాజమహేంద్రవరం రూరల్ సీటుపైనా స్పష్టత వచ్చేసింది. ప్రత్యామ్నాయంగా జనసేనకు నిడదవోలు స్థానం కేటాయించి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్లకే టీడీపీ సీటు ఖాయం చేసింది. కాగా గురువారం ప్రకటించిన ఆరు స్థానాల్లో నాలుగు స్థానాల్లో అభ్యర్థులు ఏకంగా తొలిసారి పోటీ చేస్తున్నవారే కావడం విశేషం. ఈ ఎంపికలోను ఇరుపార్టీలు సామాజిక సమతూకం పాటించాయి. కాగా పవన్ పిఠాపురం నుంచి బరిలోకి దిగుతుండడంతో టీడీపీ ఇన్‌చార్జి వర్మకు అన్యాయం జరిగిందంటూ తెలుగుదేశం శ్రేణులు ఆందోళనకు దిగాయి.

అన్నీ బేరీజు వేసి... ధీటైన ఎంపిక చేసి..



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మెజార్టీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన పావులు కదుపుతున్నాయి. అందులో భాగంగా అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘ కసరత్తు జరిపిన తర్వాతే గెలుపు గుర్రాలను ఖాయం చేస్తున్నాయి. తాజాగా గురువారం టీడీపీ రెండో జాబితా విడుదల చేసింది. ఇందులో నాలుగు స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. రాజమహేంద్రవరం రూరల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేరును ఖాయం చేసింది. ప్రత్తిపాడు నుంచి వరుపుల సత్యప్రభ, రామచంద్రపురం నుంచి వాసంశెట్టి సుభాష్, రంపచోడవరం నుంచి మిరియాల శిరీష పేర్లు ఖరారయ్యాయి. వాస్తవానికి గత నెల 24న టీడీపీ అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన సమయంలో ఈ నాలుగు సీట్లను పెండింగ్‌లో ఉంచింది. వీటిలో కొన్ని సీట్లను జనసేన కోరుతుండడం, మరికొన్నిచోట్ల అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా ఉండడంతో పార్టీ అధిష్ఠానం విస్తృత కసరత్తు జరిపింది. రాజమహేంద్రవరం రూరల్ సీటు విషయమై ఇరుపార్టీల మధ్య పీటముడి కొనసాగడంతో తొలి విడత జాబితాలో అభ్యర్థి ప్రకటన వాయిదాపడింది.ఎట్టకేలకు ఈ సీటుపై ఇరుపార్టీలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. రాజమహేంద్రవరం రూరల్ సీటుకు బదులు దుర్గేష్‌కు నిడదవోలు ఇవ్వడానికి టీడీపీ ముందుకు రావడంతో బుచ్చయ్యకు లైన్‌క్లియర్ అయింది. ఈ నేపథ్యంలో గురువారం నాటి జాబితాలో గోరంట్ల పేరు ప్రకటించారు. అటు రామచంద్రపురం సీటు కోసం శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన వాసంశెట్టి సుభాష్, కాదా వెంకటరమణ పోటీపడ్డారు. వైసీపీ నుంచి ఎంపీ బోస్ తనయుడు బరిలో ఉన్న నేపథ్యంలో ఆయన్ను సమర్థవంతంగా ఢీకొట్టే యువకుడిగా సుభాష్‌ను గుర్తించి ఆయనకు సీటు ఖాయం చేశారు. పైగా ఇక్కడ అభ్యర్థిని ప్రకటించడానికి ముందురోజు కూడా టీడీపీ ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. ఇందులో సుభాష్ వైపు మొగ్గు రావడంతో పేరు ఖాయం చేసింది. ప్రత్తిపాడు సీటు వరుపుల సత్యప్రభకు ఖాయమైంది. తొలివిడత జాబితాలో ఈమె పేరు ఉంటుందని భావించినా పార్టీలో అంతర్గత సమస్యలను చక్కదిద్దాల్సి రావడంతో ప్రకటన వాయిదా వేశారు. అటు జనసేన కూడా ఈ సీటు కోరడంతో ప్రకటించలేదు. అయితే పిఠాపురం సీటు నుంచి పవన్ పోటీ ఖాయం అవడంతో, ప్రత్తిపాడు నుంచి కాపు సామాజికవర్గానికి చెందిన సత్యప్రభకు లైన్‌క్లియర్ అయింది. అటు రంపచోడవరం సీటు అనూహ్యంగా మిర్యాల శిరీషను వరించింది. రాజవొమ్మంగి మండలం గింజర్తికి చెందిన ఈమె గిరిజనతెగలో కోయ సామాజికవర్గానికి చెందినవారు. గతంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి సీటు ఆశించినా వైసీపీకి ధీటైన అభ్యర్థిగా శిరీష అని తేలడంతో సీటు ఈమెకే ఖరారైంది. తాజాగా టీడీపీ ప్రకటించిన నాలుగు సీట్లలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి మినహా మిగిలిన ముగ్గురు అభ్యర్థులు తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న నేతలే. ఇదిలా ఉంటే తాజా రెండో జాబితాతో కలిపి ఇప్పటివరకు మొత్తం 13 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను బరిలోకి దింపినట్టయింది. ఇందులో ఎక్కడికక్కడ సామాజిక సమతూకం పాటించి అన్నివర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా జాగ్రత్తలు తీసుకుని గెలుపుగుర్రాలను ఎంపిక చేసిందనే అభిప్రాయం వినిపిస్తోంది.

తూర్పున మరో రెండు..

గోపాలపురం నుంచి మద్దిపాటి.. కొవ్వూరు ముప్పిడి..

రాజమహేంద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలోకి పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా నుంచి కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాలు కలిసిన విషయం తెలిసిందే. ఈ మూడు నియోజకవర్గాలకు సంబంధించి తెలుగుదేశం, జనసేన ఉమ్మడి పొత్తులో భాగంగా ఇప్పటికే నిడదవోలు అసెంబ్లీ నుంచి జనసేన అభ్యర్థిగా కందుల దుర్గేష్‌ను ప్రకటించారు. గురువారం ప్రకటించిన టీడీపీ జాబితాలో కొవ్వూరు నుంచి ముప్పిడి వెంకటేశ్వరరావును అభ్యర్థిగా ఎంపిక చేశారు. ముప్పిడి 2014లో గోపాలపురం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికకాగా, 2019లో ఓటమి పాలయ్యారు. గోపాలపురం వైసీపీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న తలారి వెంకట్రావును ఇటీవల ఆ పార్టీ అధిష్ఠానం కొవ్వూరు నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో గతేడాది ఎన్నికల్లో తలపడిన ముప్పిడి, వెంకట్రావులు ఈసారి మళ్లీ కొవ్వూరు నుంచి తలపడుతున్నట్టు అయింది.ఇక తాజాగా టీడీపీ ప్రకటించిన జాబితాలో గోపాలపురం అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజును ప్రకటిస్తూ టీడీపీ అధిష్ఠానం క్లియరెన్స్ ఇచ్చింది. ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థినిగా హోం మంత్రి తానేటి వనిత పోటీ చేస్తున్నారు. తొలి జాబితాలోనే గోపాలపురం సీటు ప్రకటించాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల రీత్యా నిలుపుదల చేశారు. నియోజకవర్గంలో అంతా సర్దుబాటు చేసి ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న మద్దిపాటి వెంకట్రాజునే అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో విభజిత తూర్పు యుద్ధానికి సిద్ధమైంది.

ఆ రెండూ ఎప్పుడో...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ స్థానాలకు ఇప్పటి వరకు రెండు జాబితాల్లో కలిపి టీడీపీ, జనసేన 17 సీట్లలో అభ్యర్థులను ప్రకటించినట్టయింది. ఇంకా కాకినాడ సిటీ, అమలాపురం నియోజకవర్గాల్లో బరిలో ఎవరు ఉంటారనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. కాకినాడ సిటీలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడిని ఢీకొట్టే సమర్థ నేతను ఎంపిక చేయడం కోసం కొన్నిరోజులుగా టీడీపీ అధిష్ఠానం ఎడతెగని కసరత్తు చేస్తోంది. పైగా ద్వారంపూడిని ఎలాగైనా ఓడించాలని టీడీపీ, జనసేన పార్టీలు పట్టుదలగా ఉన్నాయి. ఈయన ఎలా గెలుస్తాడో చూస్తానంటూ పవన్ సైతం ఇప్పటికే శపథం పట్టారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కొండబాబు టిక్కెట్టు రేసులో ఉన్నా మరింత మెరుగైన అభ్యర్థి కోసం వడపోత పోస్తున్నట్టు సమాచారం. అమలాపురం సీటుపైనా ఉత్కంఠ నెలకొంది. ఈ సీటు జనసేన కోరుతోంది. టీడీపీ నుంచి కూడా పోటీ ఉంది. అయితే రామచంద్రపురం సీటులో తాజాగా టీడీపీ తన అభ్యర్థిని నిలబెట్టడంతో జనసేనకు అమలాపురం సీటు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. త్వరలో ఈ రెండు స్థానాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా ఇప్పటి వరకు ఇరు పార్టీలు ప్రకటించిన మొత్తం 17 అసెంబ్లీ సీట్లలో ఎనిమిది మంది పూర్తిగా మొదటిసారి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేస్తున్న వారే కావడం విశేషం. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో మూడు ఎంపీ స్థానాలపైనా త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

సస్పెన్స్‌కు తెర.. పవన్ రెడీ!

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీచేసే స్థానంపై కొంతకాలంగా నెలకొన్న సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. పిఠాపురం సీటు నుంచి తాను పోటీ చేస్తున్నట్టు స్వయంగా పవన్ ప్రకటించడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు అందరి దృష్టి ఈ నియోజకవర్గంపై పడింది. వాస్తవానికి ఈసారి పవన్ పిఠాపురం నుంచే బరిలోకి దిగుతారని బలంగా ప్రచారం జరిగింది. అదే సమయంలో గతంలో పోటీచేసిన గాజువాక, భీమవరం నుంచి కూడా పోటీ చేయవచ్చనే చర్చ జరిగింది. కానీ బుధవారం ఈ రెండు స్థానాల్లో అభ్యర్థులను వెల్లడించడంతో పవన్ పిఠాపురం నుంచి పోటీచేయడం ఖాయమని తేలిపోయింది. పవన్ కూడా గురువారం ఇదే విషయాన్ని ప్రకటించారు. దీంతో పవన్ పోటీ చేసే స్థానంపై సస్పెన్స్‌కు ముగింపు లభించింది. అటు పిఠాపురం నుంచే పవన్ బరిలోకి దిగుతారని ఆంధ్రజ్యోతి ముందే వెల్లడించింది. పవన్ ప్రకటన నేపథ్యంలో పిఠాపురం టీడీపీలో ముసలం రాజుకుంది. ప్రస్తుత ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వర్మకు అన్యాయం జరిగిందంటూ టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. టీడీపీ గెలిచే స్థానం అయినప్పటికీ అధిష్ఠానం ఈ సీటును జనసేనకు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. వర్మకు టిక్కెట్టు లేకపోవడంతో పిఠాపురం టీడీపీ కార్యాలయం ఎదుట పార్టీ జెండాలను కార్యకర్తలు తగులబెట్టారు. అటు వర్మ కూడా మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం టీడీపీ కార్యకర్తలు నిర్వహిస్తున్న సమావేశానికి హాజరై పార్టీ కేడర్ అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు. ఈనేపథ్యంలో వర్మ ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతారనే చర్చ జరుగుతోంది. మరోపక్క పవన్ పిఠాపురం నుంచి పోటీ ఖాయమైన నేపథ్యంలో సినీ డైరెక్టర్ రాంగోపాల్‌వర్మ తాను కూడా పిఠాపురం నుంచి పోటీ చేస్తానని సోషల్ మీడియాలో ప్రకటించడం విశేషం. ఇదిలా ఉంటే రిజర్వుడు నియోజకవర్గమైన రాజోలు సీటు మాజీ ఐఏఎస్ అధికారి వరప్రసాద్‌కు ఖరారైంది. జనసేనలో కీలకమైన జనవాణి కార్యక్రమాన్ని వరప్రసాద్ కొన్నేళ్లుగా పర్యవేక్షిస్తున్నారు. మలికిపురం మండలం దిండికి చెందిన ఈయన స్థానికుడు కూడా కావడంతో టిక్కెట్టు ఇవ్వడానికి జనసేన మొగ్గు చూపింది. అయితే ఈయనకు సీటు కేటాయింపుపై అధికారిక ప్రకటన రావలసి ఉంది.

తూర్పు.. కూర్పు

- జిల్లాలో కూటమి అభ్యర్థుల ఖరారు
- ఇక లోక్‌సభ సీటు బీజేపీకే..
- అధికారిక ప్రకటనే తరువాయి
- వెనుకబడిన వైసీపీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో టీడీపీ అభ్యర్థులను మొత్తం ఖరారు చేసింది. టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థుల ఖరారు పూర్తయింది. ఇక రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ పోటీ చేయనుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేస్తారని చెబుతున్నారు. కానీ అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.ఈ ప్రకటన జారీ అయితే జిల్లాలో టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి ముందుగానే అభ్యర్థులను ఖరారు చేసినట్టు అవుతుంది.దీంతో ఎన్నికల బరికి కూటమి సిద్ధమైంది. వైసీపీ ఇంకా ముగ్గురు అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అభ్యర్థులను ఖరారు చేయడంలో వెనుకబడిపోయింది. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానం ఉన్న సంగతి తెలిసిందే. గురువారం రాజమహేంద్రవరం రూరల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు, కొవ్వూరు నుంచి మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేరును ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో జిల్లాలో మొత్తం అసెంబ్లీ అభ్యర్థులను ఖరారు చేసి బరిలో కూటమి బలంగా నిలబడింది. తెలుగుదేశం- జనసేన ఉమ్మడిగా ప్రకటించిన తొలిజాబితాలో రాజమహేంద్రవరం సిటీ నుంచి ఆదిరెడ్డి వాసు, అనపర్తి నుంచి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం నుంచి జనసేన నేత బత్తుల బలరామకృష్ణ పేరు ప్రకటించిన విషయం తెలిసిందే. తర్వాత నిడదవోలు నుంచి జనసేన నేత కందుల దుర్గేష్ పేరును ప్రత్యేకంగా పవన్ కల్యాణ్ ప్రకటించారు. జిల్లాలో టీడీపీ ఐదు స్థానాల నుంచి జనసేన రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నాయి. లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించిన సంగతి తెలిసిందే. ఇక టీడీపీ సీనియర్‌నేత, పొలిట్ బ్యూరో సభ్యుడు, రూరల్ సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి 10వ సారి ఎన్నికల బరిలో దిగనున్నారు. ఎన్టీఆర్ పిలుపుతో టీడీపీలో చేరిన బుచ్చయ్యచౌదరి ఇప్పటి వరకూ 9 సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఆరుసార్లు విజయం సాధించారు. కొవ్వూరు నుంచి గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బరిలోకి దిగారు. ఇక్కడ ఒక విశేషం ఉంది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరావు, కొవ్వూరులో వైసీపీ అభ్యర్థిగా ఉన్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఇప్పటికే రెండు సార్లు పోటీ పడ్డారు. ఇది మూడో సారి. 2014,2019 ఎన్నికల్లో ఒకరి చేతిలో మరొకరు ఓడిపోయారు. ఇవాళ ఈ ఇద్దరినీ తెలుగుదేశం, వైసీపీ పార్టీలు కొవ్వూరు నుంచి పోటీ చేయిస్తున్న సంగతి తెలిసిందే. ఇలా మూడోసారి పోటీపడుతున్నారు. కొవ్వూరులో మాజీ మంత్రి,జిల్లా టీడీపీ అధ్యక్షుడు కెఎస్ జవహర్‌కు టికెట్ రాకపోవడంతో ఆయన వర్గం అసంతృప్తిగా ఉంది. జవహర్ మాట్లాడుతూ తాను ఇక్కడ నుంచే పోటీ చేస్తానని ప్రకటించడం గమనార్హం.గోపాలపురం నుంచి తొలిసారి టీడీపీ అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజు పోటీ చేస్తున్నారు. జిల్లాలో మొదటగా మద్దిపాటి వెంకట్రాజు పేరునే చంద్రబాబు సుమారు రెండేళ్ల క్రితమే ప్రకటించినట్టు అయింది.ఇవాళ చంద్రబాబు అధికారికంగా వెంకట్రాజు పేరును ప్రకటించారు. బీజేపీ నేతలు కొంతమంది అనపర్తి అసెంబ్లీ స్థానం కోసం పట్టుపడుతున్నట్టు సమాచారం. కానీ టీడీపీ ఇప్పటికే అక్కడి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీజేపీ అభ్యర్థనను టీడీపీ ససేమిరా అంటున్నట్టు సమాచారం.దీంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎన్నికలకు సిద్ధమైంది. ఇకషెడ్యూల్ రావడమే తరువాయి. అభ్యర్థులను పూర్తిగా ఖరారు చేయడంలో అధికార వైసీపీ వెనుకబడింది. ముందుగా హడావిడి చేసి నాలుగు స్థానాల్లో మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీని సమన్వయకర్తల పేరుతో అసెంబ్లీ స్థానాలకు బదిలీచేసింది. ఎంపీ స్థానంలో సమన్వయకర్తగా డా.గూడూరి శ్రీనివాసరావును ప్రకటించింది. సమన్వయకర్తలంతా అభ్యర్థులు కాదని ఆ పార్టీ నేతలే ప్రకటించడంతో ఎవరు అభ్యర్థులో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. అంతేకాక అనపర్తి,రాజానగరం, నిడదవోలు వైసీపీకి సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. కానీ వారిని కూడా ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

వైనాట్ 0కి సీఎం జగన్ వెళ్లిపోయాడు

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 14 : ఈ వైసీపీ నాయకులంతా ఐదేళ్లపాటు గాడిదలు కాశారా.. ఎన్నికల ముందు శంకుస్థాపనలు చేస్తారా అని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రశ్నించారు. రాజమహేంద్రవరంలో తన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌కే సిగ్గు ఎగ్గు లేకుండా పూర్తి కాని భవనాలను ప్రారంభించారు. మంత్రులు ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యంగా చేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం రూరల్ సిటీలలో 56 వేల మంది లబ్ధిదారులను నిర్ణయించి ఎంత మందికి పట్టాలు ఇచ్చారన్నారు. గతంలో ఇచ్చిన పట్టాలు నాలుక గీసుకోవడానికి పనికిరాకుండా పోయాయన్నారు. ఇళ్ళకోసం సేకరించిన భూముల్లో భారీ ఎత్తున అవినీతి జరిగింది, ఎంపీలు ,ఎమ్మెల్యేలు కలిసి దోపిడీ చేశారన్నారు . దానిలో జగన్‌కు వాటాలు వెళ్లాయని ఆరోపించారు. రూరల్ ఆయన పాత్రలు పంచిపెట్టాడు, ఇప్పుడు చీరలు పంచడానికి సిద్ధంగా ఉన్నాడన్నారు. వైనాట్ 0కి జగన్ వెళ్లిపోయాడన్నారు. అన్నివర్గాల ప్రజలు జగన్‌ను ఛీకొడుతున్నారని ఇటువంటి తరుణంలో జగన్ ఎన్నికలకు కూడా వెళ్లకుండా దిగిపోవాలన్నారు. జగనన్న కాలనీ పేరుతో లక్షలాది మందిని మోసం చేసిన జగన్ కు గుణపాఠం చెబుతామన్నారు. పోస్టల్ బ్యాలెట్ దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్నారు. 85 ఏళ్ళ వయస్సుగల వారు ఇంటి వద్దే ఓటు వేస్తారు అందువల్ల ప్రలోభపెట్టే అవకాశం ఉందన్నారు. చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. సిద్ధం అన్నది దీనికా గిన్నెలు, చీరలు ,మద్యం పంచడానికా జగన్ అని ప్రశ్నించారు. ఇప్పటికే కర్నాటక మద్యం రాష్ట్రంలోకి తెచ్చేశాడన్నారు. తెలుగు జాతిని సిగ్గుపరుస్తున్న జగన్‌ను ఓడించాలన్నారు. జిల్లా కలెక్టరేట్ అవినీతికి అడ్డాగా మారిపోయిందన్నారు.

మీ చీరలు మాకొద్దు.. మంచినీళ్లివ్వండి!

రాజమహేంద్రవరం బెస్తా వీధిలో మహిళల ఆందోళన - భరత్‌రామ్ పంపిణీ చేసిన చీరలు దహనం చేసి నిరసన



బెస్తావీధిలో చీరలు దహనం చేసి ఆందోళన చేస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 14: చీరలు.. సారెలు పంచి ఇదే అభివృద్ధి అనుకోండి అంటే ఓట్లు రావని రాజమహేంద్రవరం ప్రజలుకు అన్ని తెలుసునని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరం బెస్తావీధిలో స్థానిక మహిళలు ఎంపీ భరత్ రామ్ తీరును నిరసిస్తూ ఎంపీ పంచిన చీరలు దగ్ధం చేశారు. సురక్షిత తాగునీరు కావాలంటూ ఖాళీ బిందెలతో ప్రదర్శన చేశారు. గురువారం టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు ఆధ్వర్యంలో ఖాళీ బిందెలు, డ్రైనేజీ వాటర్‌తో తాగునీరు కలిసిన నీరు పోసిన బాటిల్స్, ఎంపీ ఇచ్చిన చీరలతో నిరసన ప్రదర్శన చేశారు. ఆందోళనకారులకు ఆయన మద్దతుగా నిలిచి మాట్లాడారు. తమ హయాంలో మంచినీటి విషయంలో ఏనాడు ఇబ్బంది పడలేదన్నారు. ప్రజల అవసరాలు తీర్చేవాడే ప్రజాప్రతినిధి అన్నారు. పదిరోజుల కిందట ఒకరిని పరామర్శించడానికి వచ్చాను.. అప్పటికే రోడ్డు తవ్వేసివదలేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం పైప్‌లైన్ వేయాలని గోతులు తవ్వేశారు. కానీ లైన్ వెంచలేదన్నారు. ఇదే విషయాన్ని అధికారులకు చెప్పానన్నారు. రాజమహేంద్రవరం అభివృద్ధిలో భరత్ రామ్ చేసిన తప్పులు కప్పిపుచ్చడానికి చీర సారె ఇస్తున్నాడన్నారు. ఎంపీ భరత్ రామ్ నగరంలో రాళ్ళు రప్పలు అంటించాడు తప్ప చేసిందేమీలేదన్నారు. స్థానిక మహిళ రొక్కం వరలక్ష్మి మాట్లాడుతూ తమకు చీరలు అనవసరంలేదు తమ ప్రాణాలు కాపాడేందుకు సురక్షితమైన తాగునీరందించాలన్నారు. ఇటీవల ఎంపి భరత్ రామ్ వస్తే మంచినీటి కుళాయిలో ధార సక్రమంగా రావడంలేదంటే ఎంత లావు ధార కావాలమ్మా అంటూ వెటకారంగా మాట్లాడారన్నారు. తాగునీరు అందించలేకపోయారు గాని చీరలు పంచుతున్నాడన్నారు.నగర అధ్యక్షుడు రెడ్డి మణి మాట్లాడుతూ గత రెండు నెలలుగా ఈ ప్రాంతంలో గోతులు తవ్వేశారని డ్రైనేజీ వాటర్ కలిసి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎకరా కొండ, పిల్లి నాగలక్ష్మి, సానబోయిన పరమేశ్వరి, మహాలక్ష్మి, నాయకులు దొండపాటి కృష్ణాపర్ వీర్రాజు, పసలపూడి ఎలిషా, కోటేశ్వరరావు, యడ్ల గండియ్య, రామకృష్ణ, కుడుపూడి నాగు, సప్పావెంకటరమణ, కర్రి సూర్యనాయుడు, లోకేష్, చాపల చిన్నరాజు, కర్రి కాశి, గాయత్రి, మేరి, కృష్ణపర్ ,యడ్ల గండిపోసియ్య, బోయి బాబి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేడా శ్రీనివాస్

రాష్ట్రంలో అవినీతి పాలన : మేడా

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 14: రాష్ట్రంలో అవినీతి పరిపాలనను ప్రజలు తమ ఓట్లతో అంతమొందించాలని రాష్ట్రీయప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపకుడు మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు రాష్ట్రాన్ని అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయని పాలకులు మాత్రం ప్రజా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ అవినీతి మయంగా మారాయన్నారు. బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లను పెంచిపోషిస్తున్నారని ఆరోపించారు. ఉపాధి గాలికొదిలేశారని.. రాజమహేంద్రవరం మురికి కూపంగా మార్చేశారని మండిపడ్డారు. కేజీ బేసిన్‌లో 70 లక్షల కోట్లు చమురునిక్షేపాలను కార్పొరేట్ సంస్థలు కొల్లగొట్టుకుపోతుంటే ఈ ప్రాంత అభివృద్ధికి మనవాటా మనకు అడిగే ఎంపీలే లేకుండా పోయారన్నారు. అందుకే రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నుంచి పోరాడే వారిని ఎన్నికల బరిలోకి దింపుతున్నామన్నారు. ఇప్పటికే బాపట్ల, హిందూపురం, అమలాపురం, అనకాపల్లి, విశాఖపట్నం లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించామని చెప్పారు. త్వరలో రాజమండ్రితో పాటు మరొక ఎంపీ స్థానాన్ని ప్రకటిస్తామన్నారు. సమావేశంలో పెండ్యాల కామరాజు, డివి రమణమూర్తి, సత్తి వెంకటరెడ్డి, వర్ధనపు శరత్ కుమార్, ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

లారీలపై ఓవర్ లోడ్ వేయొద్దు : సీఐ

దేవరపల్లి, మార్చి 14: క్వారీ పరిశ్రమల్లో రవాణా చేస్తున్న లారీలపై ఓవర్‌లోడ్, ఓవర్‌స్పీడ్ చేయరాదని సీఐ బాలసురేష్‌బాబు అన్నారు. మండలంలోని దుద్దుకూరులో క్వారీ యజమానులు, డ్రైవర్లతో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మెటల్, ఇసుక రవాణా చేస్తున్నప్పుడు లారీలపై టార్పలిన్లు కప్పకపోవడం వల్ల వెనుక వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా లారీలు నడపరాదని, ప్రతీ లారీకి ఇన్సూరెన్స్ కచ్చితంగా చేయించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీహరిరావు, లారీ యూనియన్ సంఘం నాయకులు మస్తాన్, ఆకాష్, ఏడుకొండలు, సత్యనారాయణ, లారీ యాజమానుల సంఘం నాయకులు భద్రం, శ్రీను, బాజీ, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల తనిఖీ

కొవ్వూరు, మార్చి 14: అధికలోడుతో ఇసుక తరలిస్తున్న లారీలను డీఎస్పీ కేసీహెచ్ రామారావు తనిఖీ చేశారు. గురువారం కొవ్వూరు నందమూరు రోడ్‌లోని గ్యాస్ గొడౌన్ సమీపంలో ఆగి ఉన్న లారీలను అటుగా వెళ్తున్న డీఎస్పీ ఆపి పత్రాలు తనిఖీ చేశారు. లారీల్లో నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఇసుక తరలిస్తున్నారని గమనించి, లారీలను ఇసుకతో కాటా వేయించి చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసులను ఆదేశించారు.

వేగేశ్వరపురంలో కాలువ పూడిక తీత పనులు

తాళ్లపూడి, మార్చి 14: మండలంలోని వేగేశ్వరపురం పంపింగ్ స్కీమ్ కాలువ పూడిక తీత పనులు మొదలుపెట్టారు. స్కీం కాలువ చెత్త, గుర్రపుడెక్కతో నిండిపోవడంతో వరి పంటకు సాగు నీరందడం లేదని చేసిన ఫిర్యాదు మేరకు ఎట్టకేలకు పంపింగ్ స్కీమ్ పూడిక తీత పనులు ప్రారంభించారని, ఆయకట్ట రైతులకు మేలు కులుగుతుందని సూలా పోసియ్య, పైడి బాబీ పేర్కొన్నారు.

పల్లంట్లలో ఆర్వో ప్లాంటు ప్రారంభం

దేవరపల్లి, మార్చి 14: మండలంలోని పల్లంట్ల గ్రామంలో ఆర్వో ప్లాంటును, సొసైటీ గొడౌన్‌ను గురువారం హోం మంత్రి తానేటి వనిత ప్రారంభించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీనే గెలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గుడూరి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, కూచిపూడి సతీష్, సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



గోపాలపురం పొగాకు వేలం కేంద్రం

రైతు సంఘం అధ్యక్షుడిగా రాంబాబు

గోపాలపురం, మార్చి 14: గోపాలపురం పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడిగా ఇళ్లూరి రాంబాబు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వేలం కేంద్రం పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని రాంబాబును ఎన్నుకున్నారు. రైతు సంఘం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, గత సంఘంలో సభ్యుడిగా సేవలను గుర్తించి రాంబాబును అధ్యక్షుడిగా ఎన్నిక చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మాజీ అధ్యక్షుడు పిన్నమనేని మధుమోహన్, దుగ్గిరాల రాంబాబు, వడ్లమూడి రమేష్, జొన్నగడ్డ ప్రసాద్, దుగ్గిరాల శ్రీనివాసరావు, రామారావు, పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు అందజేత

కొవ్వూరు, మార్చి 14: భారత్ వికాస్ పరిషత్, శివమ్ ఎంటర్‌ప్రైజస్ సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా మెటీరియల్‌ను అందజేశారు. గురువారం కొవ్వూరులోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు బీవీపీ అధ్యక్షుడు వై.రమేష్ ఆధ్వర్యంలో ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ కేఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు ఆహార అలవాట్లను మార్చుకోవాలని, సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జీబీవీ సుబ్రహ్మణ్యం, ఎస్.రాఘవేంద్రరావు, నాళం అప్పారావు, సత్యనారాయణ, శ్రీనివాస్, హెచ్ఎం వి.గంగభవాని, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

నేడు కొవ్వూరుకు ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మార్చి 14: కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు కొవ్వూరులోని టీడీపీ కార్యాలయానికి శుక్రవారం ఉదయం 11గంటలకు రానున్నట్టు ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి తెలిపారు. ఈ సందర్భంగా జరిగే సమావేశానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరు కావాలని చెప్పారు.

గలంతైన యువకుడి మృతదేహం లభ్యం

కొవ్వూరు, మార్చి 14: గోదావరిలో దూకి గల్లంతయిన యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఎం.సునోద్‌కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం మల్లయ్యపేట ఆర్‌అండ్‌బీ కాలనీకి చెందిన పట్నాల వీరవెంకట శివ సత్యనారాయణ (22) తనకు సరైన ఉద్యోగం రాలేదని మనస్తాపంతో ఈ నెల 12న గామన్ వంతెన పైనుంచి గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. గురువారం మృతదేహాన్ని కొవ్వూరు దండకుంటరేవు సమీపంలో పోలీసులు గుర్తించారు. మృతుడి అన్నయ్య పట్నాల దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, మార్చి 14: మండలంలో నిర్వహించిన గన్నమని శేషగిరిరావు ప్రతిభా పాటవ పరీక్షలో విజేతలైన విద్యార్థులకు గురువారం స్థానిక నెం.1 పాఠశాలలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. అన్ని సబ్జెక్టుల్లో ప్రథమ, ద్వితీయస్థానాలకు ఉండ్రాజవరం నెం.1 పాఠశాల ఎంపిక కాగా, తృతీయస్థానానికి కాల్ధరి నెం.3 పాఠశాల ఎంపికైంది. వీరికి ఎంఈవోలు సక్సేనరాజు, శారదాజ్యోత్స్న బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆవ స్కాం-2కు తెరలేపిన ఎంపీ భరత్

దోచుకున్న ప్రజాధనంతో ఎన్నికలకు సమాయత్తం

టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 14: ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆవ స్కామ్-2కు తెరలేపారని టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు ఆరోపించారు. రాజమహేంద్రవరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఆవ భూముల విషయంలో చేసిన అవినీతి అందరికీ తెలిసిన విషయమేనని, ఇప్పుడు కానవరం, పల్లకడియం, బూరుగుపూడి ప్రాంతాల్లో మళ్లీ కొత్తగా 500 ఎకరాలు సేకరించిన ఎంపీ భరత్ ఆవస్కామ్-2కు తెరలేపి ఖాళీ అయిన తన ఖజానాను నింపుకునేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. ఎక్కువ ధరకు ప్రభుత్వంతో రైతుల నుంచి భూములు కొనుగోలు చేయించే తతంగమంతా పూర్తయిన తర్వాత రైతుల నుంచి అధిక మొత్తంలో వెనక్కి తీసుకునేలా బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేస్తున్నాడన్నారు. గతంలో ఆవ భూముల్లో దోచుకున్న సొమ్ములో కొంత సీఎం జగన్‌కు ఇవ్వగా మిగిలిన దానితో ఇప్పటివరకు ఫ్లెక్సీలు, పబ్లిసిటీ, చీరలు పంపిణీ చేసి రాజకీయాలు చేశాడని, ఖాళీ అయిన ఖజాను నింపుకోవడానికి రెండు రోజులుగా సీఎంవో కార్యాలయంలో కూర్చుని ఫైనాన్స్ విభాగం నుంచి నిధులు మంజూరు చేయించి భూములు విక్రయించిన రైతులకు తక్కువ ఇచ్చి మిగిలిన సొమ్మును ఈ ఎన్నికల్లో ఖర్చుచేసేందుకు ఎంపీ భరత్ ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు.

విద్యార్థులకు ఐన్‌స్టీన్ జీవితం దిక్సూచి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 14: విద్యార్థులకు ఐన్‌స్టీన్ జీవితం ఒక దిక్సూచి లాంటిదని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అన్నారు. కళాశాలలో ఐన్‌స్టీన్ 145వ జయంతిని గురువారం నిర్వహించారు. ఐన్‌స్టీన్ భౌతికశాస్త్ర అభివృద్ధికి చేసిన కృషిని, సేవలను కొనియాడారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో రాణించడానికి మంచి ఆలోచనా దృక్పథం కలిగి ఉన్నప్పుడే వారు ఎంచుకున్న రంగంలో విజయాన్ని పొందుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి సీహెచ్ కోమలలక్ష్మి, బి.దుర్గాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు హుకుంపేటలో జయహో బీసీ సభ

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 14: ఈ నెల 15న రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట జంక్షన్ డీమార్ట్‌ను ఆనుకుని ఉన్న ప్రాంగణంలో జరిగే జయహో బీసీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన బీసీ ప్రముఖులు హాజరు కానున్నారని, రూరల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఐటీడీపీ సభ్యులు, అనుబంధ సంఘాలు హాజరు కావాలని కోరారు.

జవహర్‌కు కొవ్వూరు టిక్కెట్టు ఇవ్వాలి

- టీడీపీ రెండో జాబితాలో కనిపించని జిల్లా అధ్యక్షుడి పేరు
- ఆగ్రహం వ్యక్తం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- కొవ్వూరులో ఫ్లెక్సీల చించివేత, టైర్లు దహనం

కొవ్వూరు, మార్చి 14: కొవ్వూరు అసెంబ్లీ టిక్కెటును టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్‌కు కేటాయించకపోవడంతో కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ గురువారం ప్రకటించిన రెండో విడత టీడీపీ అభ్యర్థుల జాబితాలో జవహర్ పేరు లేకపోవడం ఆయన వర్గం నాయకుల్లో మంటలు రేపాయి. కొవ్వూరులోని టీడీపీ రాజమహేంద్రవరం పార్లమెంటు కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను చించివేశారు. సైకిల్ టైర్లు తెచ్చి తగలబెట్టారు. జవహర్‌ను సముదాయించడానికి వచ్చిన జోన్-2 కోఆర్డినేటర్ సుజయకృష్ణ రంగారావును జవహర్‌కు సీటు ఇవ్వకపోవడానికి ఏం తప్పు చేశారని నిలదీశారు. జవహర్‌పై అప్పుడే సర్దుకో అంటూ సోషల్‌మీడియాలో



టైర్లు దహనం చేస్తున్న టీడీపీ జవహర్ వర్గీయులు

పోస్టింగ్‌లు పెడుతున్నారని, నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి విజయానికి తమ మద్దతు అవసరం లేదా అని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షుడిగా కష్టకాలంలో పనిచేసిన వ్యక్తికి వెన్నుపోటు పొడుస్తారా అని నిలదీశారు. చంద్రబాబు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారంటే నమ్మలేదని, ఇప్పుడు నమ్మవలసి వస్తుందన్నారు. చంద్రబాబుకు విధేయుడిగా ఉన్నందుకు నమ్మించి మోసం చేస్తారా అన్నారు. కార్యక్రమంలో వేగి చిన్నా, బూరుగుపల్లి రాఘవులు, పొట్రు సిద్ధూ, చావా శ్రీనివాస్, కరుటూరి సతీష్, కోడూరి ప్రసాద్, గారపాటి వెంకట కృష్ణ, బొడ్డు రాజు, పీవీవీ భద్రం, గోలి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు నుంచే పోటీ చేస్తా : జవహర్

కొవ్వూరు అసెంబ్లీ సీటు కేటాయింపులో పార్టీ ఒక నిర్ణయం తీసుకుందని, దానిపై నియోజకవర్గంలోని కేడర్‌తో మాట్లాడి ఏం చేయాలనేది నిర్ణయం తీసుకుంటామని కేఎస్ జవహర్ అన్నారు. దానితో పాటుగా కొవ్వూరు నియోజకవర్గం నుంచి పోటీ అయితే చేయబోతున్నామన్నారు. కార్యాలయంలో నిస్సహాయంగా కూర్చున్న నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ అప్పుడే నిరసిస్తే ఎలా? ఇక ముందు యుద్ధం చేయాలన్నారు.



కొవ్వూరులో ఫ్లెక్సీలు చించివేసిన జవహర్ వర్గీయులు

ఇక్కడి పరిస్థితులను అవగాహన చేసుకుంటా : రంగారావు

టీడీపీ జోన్-2 కోఆర్డినేటర్ సుజయకృష్ణ రంగారావు మాట్లాడుతూ పార్టీ నను (కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం పార్లమెంటులకు) జోనల్ కోఆర్డినేటర్‌గా నియమించిందని, కొవ్వూరు నియోజకవర్గానికి సంబంధించి అనేకసార్లు నాయకులతో మాట్లాడానని, ఇక్కడి పరిస్థితులను అవగాహన చేసుకోవడానికి ప్రయత్నిస్తానన్నారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థుల రెండో జాబితాలో జవహర్‌కి సీటు రాకపోవడంతో ఇక్కడికి వచ్చానన్నారు. కార్యకర్తలు, నాయకులు తెలియజేసిన అంశాలు చాలావరకు తనకు తెలిసినవేనన్నారు. నియోజకవర్గంలో కొద్దిగా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉండడంతో జవహర్‌తో పాటు కార్యకర్తలను, నాయకులను కలవడానికి వచ్చానన్నారు.

ప్రజాహితానికి జనసేన కృషి

పార్టీ ఆవిర్భావ వేడుకల్లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దుర్గేష్

- పలుచోట్ల పార్టీ జెండాలు ఆవిష్కరించిన నాయకులు
- కేకులు కట్‌చేసి జనసైనికుల సంబరాలు

నిడదవోలు, మార్చి 14: జనంలో నుంచి ఆవిర్భవించిన పార్టీ జనసేన అని ప్రజాహితం కోసం పని చేస్తోందని పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. జనసేన ఆవిర్భావ వేడుకలు గురువారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. నిడదవోలులో జరిగిన కార్యక్రమంలో 11వ వార్డులో నగినబోయిన నాగరాజు ఆధ్వర్యంలో పలువురు యువకులను దుర్గేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వమన్నారు. అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేయగలిగేది తమ ప్రభుత్వమేనని, వైసీపీ అరాచక పాలనకు ప్రజలంతా స్వస్తి పలికేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు రంగా రమేష్, నాగరాజు, బాలు, శివనాయుడు, బెల్ శివ తదితర్లు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరులోని జనసేన నియోజకవర్గ కార్యాలయం వద్ద, మెరక వీధి, దొమ్మేరులో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు, నాయకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి విజయం ఖాయమన్నారు. అనంతరం వీర మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డేగల రాము, సుంకర సత్తిబాబు, గంగుమళ్ల స్వామి, కె.నవ్య, సిద్దా రామకృష్ణ, ఎంపీటీసీలు ఎరుబండి సురేష్, పసలపూడి తాతారావు, హరిబాబు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని తాడిపూడిలో జరిగిన కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు గంటా శివరామకృష్ణ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఉమ్మడి



నిడదవోలులో జనసేనలో చేరిన యువకులతో కందుల దుర్గేష్

పార్టీ విజయం కోసం కలిసి పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా తాళ్లపూడి వైసీపీ నుంచి బండ్రెడ్డి నాగేశ్వరరావు తన మిత్ర బృందంతో జనసేనలో చేరారు. కృష్ణ పార్టీ జెండా కప్పి వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో తిరుమలశెట్టి రామ్మూర్తి, చెన్నా సత్యన్నారాయణ, అయితం మణికంఠ, నామా రంగనాయకులు, ఆటపాకల శేఖర్, అవుడు కృష్ణ, దేవన సత్యనారాయణ, ఏసులంక తాతారావు, కాకర్ల సురేష్ పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో జనసేన పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు జెండా ఆవిష్కరించి కేకుకట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించాలనే ఉద్దేశంతో జనసేన ఆవిర్భవించిందని, రాష్ట్రంలో జగన్ అరాచక, రాక్షస పాలనను నియంత్రించడానికి పార్టీ కంకణం కట్టుకుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఓడించి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కాట్నం గణేష్, కంబాల సత్తిబాబు, చప్పిటి శివనాగప్రసాద్, వెంకటరత్నం, నాయుడు దుర్గాప్రసాద్, సలాది వేణుమాధవి, అడబాల మణికంఠ పాల్గొన్నారు. అనంతరం మండలంలోని కృష్ణంపాలెం, యర్నగూడెం గ్రామాల్లో జనసేన జెండాలు ఆవిష్కరించారు.

గోపాలపురం: గోపాలపురం జనసేన పార్టీ కార్యాలయం వద్ద గ్రామ అధ్యక్షుడు వడ్డీ రామలీలాధర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పవన్‌కల్యాణ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వైసీపీని గద్దె దింపడమే పవన్‌కల్యాణ్ ప్రధాన ధ్యేయమని, అధినేతతో కలిసి కార్యకర్తలంతా కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో పోసిన గణపతి, సూర్యభగవాన్, రాంబాబు, శ్రీను, సత్యనారాయణ, సీతారామరాజు, వెంకన్న, రమేష్, నాని తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడి: తాడిపూడిలో జనసేన జెండాను ఆవిష్కరిస్తున్న గంటా కృష్ణ

హైవేపై ఘోర ప్రమాదం

గ్రానైట్ లారీని ఢీకొన్న రొయ్యల లారీ.. ఓ వ్యక్తి దుర్మరణం



ప్రమాద దృశ్యం, ఘటనా స్థలంలో మృతుడు.. రొయ్యల లోడు లారీ డ్రైవర్ నాగరాజు

రాజమహేంద్రవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. త్రీటౌన్ ఎస్ఐ రామ కృష్ణ వివరాల ప్రకారం.. గుడివాడ నుంచి ఓ లారీ పచ్చి రొయ్యల లోడుతో ఒడిశా బయలుదేరింది. డ్రైవరు జీ.నాగవాసుతోపాటు అతడి స్నేహితుడు చంటిబాబు ఆ లారీలో ఉన్నారు. మార్గమధ్యలో గామన్ వంతెనపై గ్రానైట్ లోడుతో ఆగివున్న లారీని వీరి లారీ బలంగా ఢీకొట్టింది. గ్రానైట్ లారీ అధిక బరువుతో ఉండడంతో నాగవాసు లారీ తిరగబడి క్యాబిన్ నుజ్జునుజ్జయ్యింది. దీంతో డ్రైవర్ నాగరాజు ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. చంటిబాబుకు తీవ్రంగా గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. హైవేపై లారీలు నిలపకూడదనే నిబంధన ఉన్నప్పటికీ హైవే పెట్రోలింగ్ వాహనాలు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ చెప్పారు.

ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి మద్దతు

రాజానగరంలో రైతు కూలీ సంఘం ప్రదర్శన



రాజానగరంలో ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం సభ్యులు

రాజానగరం, మార్చి 14: ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి మద్దతుగా ఎస్‌కేఎం పిలుపు మేరకు అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో గురువారం రాజానగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గత రైతాంగ ఉద్యమానికి మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతాంగ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహా పంచాయతీకి మద్దతుగా దీనిలో భాగంగా ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రాజానగరంలోని అన్నదాన సత్రం నుంచి బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించి, గాంధీబొమ్మ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రైతాంగ ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వ హత్యాకాండని ఖండించాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు, మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, గున్నూరి అరవాలమ్మ, గోర్స దుర్గ, తోటకూర బేబీ, తామర్ల గౌరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మద్దిపాటి విజయానికి కృషి చేయాలి

- టీడీపీ గోపాలపురం మండలాధ్యక్షుడు సత్యనారాయణ
- 'ఎమ్మెల్యే అభ్యర్థిగా వెంకట్రాజు'పై హర్షం

గోపాలపురం, మార్చి 14: రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మద్దిపాటిని గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇవ్వనున్నామని, అందుకు నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా కృషి చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ అన్నారు. గోపాలపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజు పేరును ప్రకటించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గోపాలపురం టీడీపీ కార్యాలయం వద్ద గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో నెలకొన్న ఉత్కంఠ గురువారం టీడీపీ విడుదల చేసిన రెండో లిస్టుతో విడిపోయింది. టీడీపీ అధినేత చంద్రబాబు అభ్యర్థిగా మద్దిపాటి పేరును ప్రకటించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కార్యాలయం వద్దకు చేరుకుని బాణసంచా కాల్చి కేకును కోశారు. కార్యక్రమంలో జ్యేష్ఠ శ్రీధర్, కూనపం ప్రసాద్‌బాబు, రమేష్, రాము, జ్యేష్ఠ శ్రీనివాసరావు, శరత్‌బాబు, మద్దిపాటి రమేష్, కొడవటి గంగరాజు, కాట్రగడ్డ సురేష్, నాగరాజు, కొడవటి చినవెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


నల్లజర్ల: గోపాలపురం నియోజకవర్గానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజును టీడీపీ అధిష్ఠానం ప్రకటించడంపై మండలంలో టీడీపీ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తంచేశారు. ఈ క్రమంలో అందరినీ కలుపుకుని ఎన్నికలకు వెళ్లే పనిలో మద్దిపాటి నిమగ్నమయ్యారు.ముందుగా విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని, శుక్రవారం ద్వారకాతిరుమల




గోపాలపురంలో టీడీపీ కార్యాలయం వద్ద కేక్ కోస్తున్న పార్టీ శ్రేణులు

వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం ఎన్నికల కార్యాచరణ నల్లజర్ల నుంచి ప్రారంభించనున్నట్టు సన్నిహితులు చెబుతున్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో టీడీపీ కార్యాలయం వద్ద నాయకులు ఆనందోత్సాహాలు జరుపుకున్నారు. కేకును కట్ చేసి మీఠాయిలు పంచారు. మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో గోపాలపురం అభ్యర్థి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులందర్నీ సమన్వయ పరుస్తూ పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో ముప్పిడి వెంకటేశ్వరరావును అభ్యర్థిగా ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కొండపల్లి దొరయ్య, కాట్రు భీమరాజు, నున్నా చిన్ని, గద్దే శ్రీనివాస్, కూచిపూడి చక్రవర్తి, ఉప్పులూరి రాంబాబు, కరుటూరి శరత్, అక్కిన సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



నల్లజర్లలో హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



దేవరపల్లిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

దివాన్‌చెరువు, మార్చి 14: నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. దివాన్‌చెరువులో దాదాపు రూ.4 కోట్లతో చేపట్టనున్న ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణ పనులకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మల్టీస్పోర్ట్స్ ఇండోర్ స్టేడియాన్ని రెండంతస్తుల్లో నిర్మిస్తామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్ కోర్టులను, ఫస్ట్‌ఫ్లోర్‌లో క్రీడాకారులకు డార్మెంటరీ గదులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దూలంపెద్ద, వేమగిరి కృష్ణ, గంగిశెట్టి సోమేశ్వరరావు, మెట్ల ఏసుపాదం, యర్రంశెట్టి ధర్మరాజు, మార్గాని శ్రీను, పలివెల స్వామి, మందాల వెంకటేష్ పాల్గొన్నారు.

కార్మికుల అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

- పరిశ్రమలశాఖ జిల్లా చీఫ్ ఇన్‌స్పెక్టర్ త్రినాథరావు



ఆంధ్రా షుగర్స్‌లో భద్రతపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్న త్రినాథరావు

కొవ్వూరు, మార్చి 14: రసాయనాల తయారీ పరిశ్రమలో పనిచేసే కార్మికులు ప్రమాదాల నివారణకు మరింత అప్రమత్తంగా ఉండాలని పరిశ్రమల శాఖ జిల్లా చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.త్రినాథరావు అన్నారు. కొవ్వూరు ఆంధ్రా షుగర్స్ కర్మాగారంలో గురువారం ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ భద్రతా వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పరిశ్రమల్లో అధికంగా ప్రమాదాలు జరిగి వేలాదిమంది కార్మికులు నష్టపోతున్నారని గుర్తించిన ప్రభుత్వాలు 1972 నుంచి ప్రతి ఏడాది జాతీయ స్థాయిలో భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నాయన్నారు. భద్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ భద్రతను నిజ జీవితంలో ఒక భాగం చేసుకోవడం ద్వారా ప్రమాద రహిత సమాజాన్ని తీర్చిదిద్దవచ్చునన్నారు. ఏలూరు, రాజమహేంద్రవరంల ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎ.శ్రీనివాస్, జి.స్వాతి మాట్లాడుతూ విధి నిర్వహణలోనే కాకుండా, నిజ జీవితంలోనే మనతో పాటు మన పరిసర ప్రాంతాల్లో ఉన్న వారికి ప్రమాదాలు జరగకుండా భద్రతను పాటించాలన్నారు. భద్రత ప్రతిపౌరుడి బాధ్యత అని, ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేసినా భారీ మూల్యం చెల్లించక తప్పదన్నారు. రసాయన పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ఆ రసాయనంపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. భద్రతా పరికరాలు సమకూర్చుకోవడంతో పాటు వాటి వినియోగంపై అవగాహన ఉండాలన్నారు. ప్రమాదం జరిగిన తరువాత అప్రమత్తం కావడం కంటే ప్రమాదం జరగక ముందే జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ సేఫ్టీ ఇన్‌చార్జి కేవీవీ సత్యనారాయణమూర్తి, హెచ్‌ఆర్ ఏజీఎం సీహెచ్‌ఎస్.మహర్షి, ఎలక్ట్రికల్ అడిషనల్ చీఫ్ ఇంజనీరు జె.రఘు, ఎస్కే మొహిద్దీన్, ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, జీవీఎన్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.